తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్టేట్ రౌండప్
STATE ROUNDUP
ప్రజాజ్యోతి తెలంగాణ శనివారం 17-02-2024 పేజీల్-12

# బిఆర్ఎస్ దెబ్బకు ప్రజాభవన్‌కు సిఎం

## ఎమ్మెల్యే హరీష్‌రావు వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి16:** బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడు ప్రజల పక్షాన్నే పోరాడు తుందని మరోసారి రుజువైందని మంత్రి హరీస్ రావు అన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న ఫలంగా ప్రజా భవన్‌కు పరుగులు పెట్టడమే తాజా నిదర్శనం అన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు ప్రజాభవన్ కు వెళ్లాల్సి వచ్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు.

మిగతా 2లో..



# నేడు జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ప్రయోగం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) షార్ కేంద్రంలోని రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్వీ ఎఫ్-14 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. మధ్యాహ్నం ఈ క్రమంలో ఈరోజు మధ్యాహ్నం 2.05 గంటలకు కౌంట్ డౌన్ మొదలైంది. 27 గంటల 30 నిమిషాల కౌంట్ డౌన్ అనంతరం.. రేపు సాయంత్రం 5.35 గంటలకు శ్రీహరికోటలోని రెండో ప్రయోగ వేదిక నుంచి రాకెట్ ను నింగిలోకి పంపనున్నారు శాస్త్రవేత్తలు. ఈ రాకెట్ ద్వారా 2 వేల 275 కిలోల బరువు కలిగిన %×చీూాు-3ఱూ% అనే ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగిస్తుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఈ సమాచార ఉపగ్రహం ద్వారా భూమి ఉపతరితలం, పర్యావరణాన్ని పర్యవేక్షించడం, వాతావరణ ప్రొఫైల్ డేటాను అందించడం, డేటా సేకరణ, వ్యాప్తిని సులభతరం చేయడం, ఉపగ్రహ సహాయక శోధన, రెస్క్యూ సేవలను అందించడం ఈ మిషన్ ముఖ్యమైన లక్ష్యాలు. దీని అభివృద్ధిలో భారత్‌కు చెందిన పలు కంపెనీలు ముఖ్య పాత్ర పోషించాయి. ఇది షార్ కేంద్రం నుంచి 92వ ప్రయోగం కాగా.. జీఎస్ఎల్వీ సిరీస్‌లో 16వ ప్రయోగం పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజిన్లు తయారు చేసుకుని చేస్తున్న 10 వ ప్రయోగం కావడం విశేషం అని ఇస్రో శాస్త్రవేత్తలు వెల్లడించారు.

మిగతా 2లో..

# కవిత లిక్కర్ స్కామ్ కేసు

## విచారణ 28కి వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేసిన పిటిషన్ పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఫిబ్రవరి 28న విచారణ చేపట్టనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. నళిని చిదంబరం, అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్లతో కాకుండా కవిత పిటిషన్ ప్రత్యేకంగా విచారిస్తామని తెలిపింది. లిక్కర్ కేసులో ఈడీ ఇచ్చిన నోటీసులను కవిత గతేడాది సుప్రీంకోర్టులో సవాలు చేశారు. తనపై ఈడీ ఎలాంటి చర్యలు

మిగతా 2లో..



# బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

## కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే..

## ఈ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే

## ఈ రెండు పార్టీలు మజ్లిస్ పంచన చేరుతాయి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి16:** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి సూట్ కేసులు మోస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లను, బిల్డర్లను, కంపెనీలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. అన్నారు. మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కర్నాటక నుంచి సూట్ కేసులు వస్తే.. ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో

మిగతా 2లో..

# మేడారం జాతరకు భారీ బందోబస్తు

## బంధోబస్తులో 14000 మంది పోలీసులు

## 500 సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా!

**మేడారం,ఫిబ్రవరి16:** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం జాతర. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. అందుకనుగుణంగానే ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తుంటుంది. ఈ ఏడాది నేర రహితంగా నిర్వహించాలని భావిస్తున్నట్లు ములుగు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ శబరీష్ మీడియాకు తెలిపారు. 20 సెక్టార్లలో నాలుగు కిలోమీటర్ల మేర జాతర నిర్వహించనున్నట్లు, ట్రాఫిక్ సజావుగా ఉండేలా

మిగతా 2లో..



# హైదరాబాద్‌లో కొత్త జాతి కుక్కలు కనిపిస్తున్నాయి

## అవి ప్రజలపై దాడి చేస్తున్నాయన్నారు

## నగరంలో వీధికుక్కల దాడి వల్ల చిన్నారులు చనిపోతున్నారు

## ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి

## అసెంబ్లీలో స్పందించిన అక్బరుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్,ఫిబ్రవరి16:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో హైదరాబాద్‌లో వీధికుక్కల దాడి అంశాన్ని లేవనెత్తారు ఏఐఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ. ఆయన ప్రసంగిస్తూ, "హైదరాబాద్‌లో కొత్త జాతి కుక్కలు కనిపిస్తున్నాయి. అవి ప్రజలపై దాడి చేస్తున్నాయన్నారు." నగరంలో వీధికుక్కల దాడి వల్ల చిన్నారులు చనిపోతున్నారని, వాటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఒవైసీ కోరారు.

మిగతా 2లో..

# హైదరాబాద్‌లో కొత్త జాతి కుక్కలు కనిపిస్తున్నాయి

మొదటిపేజీ తరువాయి..

నగరంలోని పలు ఘటనల తర్వాత అక్బరుద్దీన్ ఒవైసీ ఈ ప్రకటన చేయడం మరోసారి చర్చనీయాంశమైంది. తాజాగా శంషాబాద్‌లో ఏడాదిన్నర చిన్నారిని వీధికుక్కలు కొరికి చంపాయన్నారు. గత నెలలో, మణికొండ శ్రీనివాసనగర్ కాలనీలో మరో సంఘటన జరిగిందని గుర్తు చేశారు. తన తల్లితో కలిసి కిరాణా షాపుకు వెళ్లిన ఒక పిల్లవాడిని వీధికుక్కలు గాయపరచాయన్నారు. డిసెంబరులో, దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన ప్రత్యేక సంఘటనలో ఒక బాలుడు వీధికుక్క దాడితో తీవ్రంగా గాయపడ్డాడని వివరించారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వీధికుక్కల దాడి నేపథ్యంలో అక్బరుద్దీన్ ఒవైసీ తెలంగాణ అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రభుత్వం హైదరాబాద్‌లో వీధికుక్కల దాడులను తక్షణమే నిరోధించాలన్నారు. నగరంలో పలుమార్లు వీధికుక్కల దాడులు జరుగుతున్నా సమస్య పరిష్కారానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో వీధికుక్కల సంఖ్య పెరుగుతూ.. నివాసితులకు ముప్పు కలిగిస్తోందని వివరించారు. వేసవి కాలం సమీపిస్తున్నందున, పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా కుక్కలు మరింత రెచ్చిపోయే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ-ంమైన సంఘటనలు జరుగకుండా ముందుగానే నివారించడానికి సంబంధిత అధికారులు శరవేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

# కవిత లిక్కర్ స్కామ్ కేసు

మొదటిపేజీ తరువాయి..

తీసుకోకుండా ఆదేశించాలని సుప్రీం కోర్టును కోరారు. ఈ పిటిషన్ ను పరిశీలించిన జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ల బెంచ్ ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. అయితే.. సుప్రీంకోర్టులో మహిళల ఈడీ విచారణ కేసు విచారణ పెండింగ్ లో ఉండటంతో లిక్కర్ కేసులో ఈడీ నోటీసులకు కవిత గైర్హాజరవుతున్నారు. కాగా.. ఢిల్లీ మద్యం కేసులో భాగంగా గతేడాది మార్చిలో కవితను ఈడీ అధికారులు మూడు రోజుల పాటు సుదీర్ఘంగా విచారించారు. ఈ క్రమంలో ఈడీ కార్యాలయం వద్ద కాకుండా మహిళ కాబట్టి తనను ఇంటి వద్దే విచారించాలని కోరుతూ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విషయం కోర్టు పరిధిలో ఉన్నందున తాను విచారణకు హాజరు కాలేనని కవిత ఈడీ అధికారులకు సమాచారం ఇచ్చారు. విచారణకు హాజరు కాలేనన్న కవిత సమాధానంపై ఈడీ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

# బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి..

వైసీపీ నాయకులు వెల్లల రామ్మోహన్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే అని కిషన్ రెడ్డి విమర్శించారు.

"ఈ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే. ఈ రెండు పార్టీలు మజ్లిస్ పంచన చేరుతాయి. బుజ్జగింపు రాజకీయాలు చేస్తాయి. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ మీద దర్యాప్తు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ధైర్యం లేదు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ కూడా అవినీతి పార్టీ కాబట్టి. సీబీఐతో విచారణ జరిపించాలని మేము డిమాండ్ చేస్తే.. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేస్తున్నది. విజిలెన్స్ తో అయ్యేది లేదు.. పోయేది లేదు. కాంగ్రెస్ చెయ్యి బస్మాసుర హస్తం.. చెయ్యి గుర్తుకు ఓటేస్తే.. అదే చెయ్యిని ప్రజల తలపై పెట్టి మోసం చేస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వక వారు జీహెచ్ఎంసీ ముందు ధర్నా చేసే దుర్మార్గ స్థితికి తీసుకువస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని మరింత దిగజార్చనుంది. హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా.. జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వడం లేదు"అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. గత తొమ్మిదన్నరేండ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. "రూ. 400 కోట్లతో చర్లపల్లి, రూ. 720 కోట్లతో సికింద్రాబాద్ స్టేషన్, రూ. 450 కోట్లతో కాచిగూడ, రూ. 350 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్లను మోదీ ప్రభుత్వం. ఎయిర్ పోర్టు తరహాలో సికింద్రాబాద్ స్టేషన్ డెవలప్ కానుంది. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే, పెట్టుబడులు, ఉద్యోగాలు రావాలంటే మోదీ నాయకత్వం.. బీజేపీ నాయకత్వం అవసరం. భద్రాద్రి అభివృద్ధికి రూ. 50 కోట్లు ఇచ్చారు. వరంగల్ రామప్ప దేవాలయానికి మోదీ కృషితో యునెస్కో గుర్తింపు వచ్చింది. జోగిలాంబ దేవాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలంగాణలో లక్షా 20 వేల కోట్ల రూపాయల విలువైన రహదారుల నిర్మాణం జరిగింది. హైదరాబాద్ చుట్టూ రూ. 26వేల కోట్ల ట్రిపుల్‌ఆర్ రోడ్డును మోదీ మంజూరు చేశారు. తెలంగాణ అభివృద్ధిలో ఇది గేమ్ చేంజర్ కానుంది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీది"అని పేర్కొన్నారు. దేశంలో ఉగ్రవాదంపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. "నిత్యం ఉగ్రవాదుల బాంబులతో రావణకాష్ఠంలా మండే కశ్మీర్ లో 370 ఆర్టికల్ ఎత్తేసి.. అక్కడ శాంతి నెలకొల్పిన ఘనత నరేంద్ర మోదీ ప్రభుత్వానిది. దేశంలో శాంతి భద్రతలు మెరుగయ్యాయి. హైదరాబాద్ లో ఒకప్పుడు బాంబు పేలుళ్లు, ఉగ్రవాదుల చేతిలో పలువురి హత్యలు జరిగేవి. మోదీ వచ్చిన తర్వాత ఐఎస్ఐ ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. పాక్ లో ఇండియన్ కరెన్సీ ముద్రించి భారత్ లో చెలామణి చేసేవారు. ఇప్పుడు అది ఆగింది. ప్రపంచం దృష్టిలో పాక్ ను దోషిగా నిలబెట్టిన ఘనత మోదీ ప్రభుత్వానిది. రొట్టె ముక్క కోసం ఇప్పుడు పాకిస్తా న్ లో ప్రజలు కొట్టుకుంటున్నారు. ఒకప్పుడు ఉగ్రవాదులు దేశంలో దాడులు చేస్తే.. ప్రభుత్వాలు మౌనంగా ఉండేవి. కానీ మోదీ అలా కాదు.. దేశంలో దాడులు జరిపిన టెర్రరిస్టులను గుర్తించి సర్జికల్ స్ట్రైక్ లు, ఎయిర్ స్ట్రైక్ లు చేసి వారిని మట్టుబెట్టారు. కాంగ్రెస్ హయాంలో ఎంపీలు, మంత్రులు అవినీతి ఆరోపణలతో, కుంభకోణాలతో జైలుకు వెళ్లారు. తొమ్మిన్నర ఏండ్ల మోదీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదు. వచ్చే 25 ఏండ్లలో ప్రపంచ దేశాలకు విశ్వగురువుగా భారత్ ను నిలబెట్టాలని ప్రధాని పిలుపునిచ్చారు. అందులో భాగస్వామ్యం అయ్యేందుకు మనం సిద్ధమవ్వాలి"అని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# మేడారం జాతరకు భారీ బందోబస్తు

మొదటిపేజీ తరువాయి..

ప్రత్యేక ట్రాఫిక్ వింగ్‌ని నియమించారు. జాతరలో మొదటిసారిగా పోలీసు సిబ్బంది ఎల్ అండ్ టి నుండి కొత్త సాంకేతికతను ఉపయోగించుకుంటారు. ఇది సమస్యల గురించి మేడారంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను హెచ్చరిస్తుంది. అధికారులు స్పందించడానికి, ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు వీలు కల్పిస్తుంది. అంతేకాదు.. 500 సీసీటీవీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ మీడియాతో విషయాలు వెల్లడిస్తూ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) నుండి 500 మందికి పైగా పోలీసులకు వివిధ విధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ అధికారులు బృందాలుగా ఏర్పడి నేరాల హాట్‌స్పాట్‌లను గుర్తిస్తారు. సురక్షితమైన ఊరేగింపును నిర్ధారించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారు. రద్దీని కంట్రోల్ చేయడానికి, భక్తుల కదలికలను గమనించడానికి ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. దేవతల రాక సందర్భంగా ఎలాంటి తొక్కిసలాట జరగకుండా క్యూ లైన్‌లను ఏర్పాటు చేశారు. ములుగులోని గట్టమ్మ దేవాలయం-మేడారం మధ్య 12 ట్రాఫిక్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 21 నుండి 24 వరకు, విఐపిలు, వివిఐపిలు ప్రార్థనలు చేయడానికి సందర్శిస్తారు. ఇద్దరు డీఐజీలు, 20 మంది ఎస్పీలు, 40 నుంచి 50 మంది ఏఎస్పీలు, 150 మంది డీఎస్పీలు, 400 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు (సీఐలు), 900 మంది స్పెషల్ ఇన్‌స్పెక్టర్లు, 1,000 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్ఐలు) సహా 14,000 మంది పోలీసులు రాత్రింబవళ్లూ పని చేస్తున్నారని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర నిర్వహణ కోసం నూతనంగా నియామకమైన కమిటీ ఛైర్మన్ తో సహా 14 మంది సభ్యులు సమ్మక్క సారక్క దేవతల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు.. మంత్రి సీతక్క సమక్షంలో వారంతా బాధ్యతలు స్వీకరించి ప్రమాణం చేశారు.. జాతర నిర్వహణలో మా వంతు పాత్ర పోషిస్తామని ప్రమాణం చేశారు. ఉత్సవ కమిటీలో గిరిజన - గిరిజనేతరులకు అవకాశం కల్పించిన మంత్రి సీతక్క.. పార్టీలకతీతంగా జాతర సక్సెస్ లో భాగస్వామ్యం కావాలని కోరారు.. ఉత్సవ కమిటీ నియామకాన్ని రాజకీయం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

# బిఆర్ఎస్ దెబ్బకు ప్రజాభవన్‌కు సీఎం

మొదటిపేజీ తరువాయి..

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్‌చేశారు. ప్రతి రోజు ప్రజాభవన్‌కు వెళ్తానని ప్రగల్భాలు పలికిన సీఎం అధికారంలోకి వచ్చాక తొలిరోజు మాత్రమే వెళ్లారన్నారు. ఇదే విషయంపై బీఆర్ఎస్ ఆధారాలతో నిలదీశామన్నారు.య దీంతో ఈ రోజు హడావుడిగా కేవలం అరగంట ముందు సమాచారం ఇచ్చి వెళ్తున్నారన్నారు. ఇదే విషయం నిన్ననే ప్రజలకు సమాచారమిస్తే చాలా మంది తమ బాధలు చెప్పుకునేందుకు వచ్చేవారని హరీశ్ రావు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష పార్టీ పాత్రను హుందాగా పోషిస్తుందన్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతూ పేదల పక్షాన నిలుస్తామన్నారు.

# రైతు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మద్దూర్ లో భారీ ఆటో ర్యాలీ కార్మిక ప్రదర్శన



**నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి ఫిబ్రవరి16:** దేశవ్యాప్తంగా రైతు కార్మిక సంఘాల పిలుపుమేరకు మద్దూరు మండల కేంద్రంలో భారీ ఆటో ర్యాలీ కార్మిక ప్రదర్శన నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా మద్దూర్ కొత్త బస్టాండ్ నుండి సినిమా టాకీస్ పాత బస్టాండు ఎమ్మార్వో కార్యాలయం వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి మధ్యాహ్న భోజన గ్రామపంచాయతీ ఆటో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ కేంద్రములో అధికారంలో ఉన్నా మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పోరేట్ లకు సబ్సిడీలు ఇస్తూ పేదల మీద ధరల బారలు మోపుతూన్నారని అన్నారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని అన్నారు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ రంగాల అంగన్ వాడి, ఆటో, మధ్యాహ్న భోజన గ్రామపంచాయతీ కార్మికులు పాల్గోని సమ్మెను జయప్రదం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, వి ఓ ఏ ల జిల్లా కార్యదర్శి శ్రీ నీవాస్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి



హన్మంతు, ఆటో యూనియన్ నాయకులు సత్యనారాయణ, ముకుందు రెడ్డి, అనంతయ్య, అంగన్ వాడి టీచర్స్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ, ప్రాజెక్ట్ నాయకులు పుష్ప, చంద్రకళ, భాగ్య, సౌభాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్ తహశిల్దార్ రాజోలికి బదిలీ

**మల్దకల్ ఫిబ్రవరి 16 : (ప్రజాజ్యోతి ప్రతినిధి)**
మల్దకల్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న తహసిల్దార్ హరికృష్ణ రాజోలు మండలానికి బదిలీ అయ్యారు. మానవపాడు తహసీల్దారు గా పనిచేస్తున్న జూబిర్ మోహిద్దీన్ మల్దకల్ తహసీల్దార్ గా రానున్నారు.ఇక్కడ పని చేస్తున్న నాయబ్ తహసిల్దార్ సురేష్ బాబు అలంపూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గద్వాల నాయబ్ తహసిల్దార్ ఝాన్సీ రాణి మల్దకల్ కు బదిలీపై వస్తున్నారు. ఎమ్మార్ఐ గా పనిచేస్తున్న రామకృష్ణ అలంపూర్ కు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో అలంపూర్ నుండి మద్దిలేటి ఎమ్మార్ఐ గా మల్దకల్ కు వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల అధికారులను బదిలీలు చేపట్టారు.

## సమగ్ర కులగణన తీర్మానం ప్రవేశ పెట్టిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి):**
వెనుకబడిన తరగతుల ,షెడ్యూల్ కులాల , షెడ్యూల్ తెగల, మిగతా బలహీన వర్గాల కి చెందిన ప్రజల అభ్యున్నతి నిమిత్తము వివిధ సామజిక, ఆర్థిక, విద్యా పరమైన, ఉపాధి, రాజకీయ అవకాశాలు ప్రణాళికలు రూపోందించి అమలు పరిచేలా తెలంగాణ మంత్రి వర్గం ఫిబ్రవరి 4న తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ అంతటా సమాజిక, ఆర్థిక, రాజకీయ ఉపాధి సమగ్ర ఇంటింటి కుల గణన కుటుంబ సర్వే



చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇది అపూర్వ ఘట్టం అన్నారు. నా జీవితంలో ఈరోజు మరువలేనిదన్నారు. విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో కి వచ్చిన బలహీన వర్గాల నుండి రాజకీయాల్లకి వచ్చానని తెలిపారు. కుల గణన పై పలు సార్లు మా పార్టీ నేత రాహుల్ గాంధీ ప్రస్తావన చేశానన్నారు. అందుకు అనుగుణంగా అందరి సంక్షేమానికి సంబంధించి ఉపయోగపడే విధంగా సమాచారాన్ని తీసుకొని ముందుకు పోతాం అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి తోపాటు మంత్రివర్గ తీర్మానం నుండి తీసుకున్నాం అని తెలిపారు. ఇది జనాభా గణన కుల గణన అనేది కేంద్ర ప్రభుత్వ పరిధి లో అయినప్పటికి రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులు దృష్ట్యా కుల గణన చేపడుతున్నాం అన్నారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రం లో ఎస్సి ఎస్టీ బీసీ ఇతర బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నానని సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి లకు ధన్యవాదాలు తెలిపారు.

## సామాజిక తనిఖీ ఆధ్వర్యంలో గ్రామసభ

**చిన్నకోడూర్ ,ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి):**
మండల పరిధి రామునిపట్ల గ్రామంలో సామాజిక బృందం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ రిసోర్స్ పర్సన్ రంజిత్ మాట్లాడుతూ గ్రామంలోని గతంలో జరిగిన పనులు సామాజిక బృందం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పనులు తనిఖీ బృందం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పనులు తనిఖీ పనులు ఎల్డిపి పీస్ పండు. ఎమ్మే ట్యాంక్ . గ్రామంలో జరిగినటువంటి వివిధ పనుల ను తనిఖీ చేయడం జరిగిందని అన్నారు. పనులు పూర్తిగా జరిగిన లేదా ఉపాధి హామీ పథకం కూలీలకు డబ్బులు పూర్తి స్థాయిలో అందిన వా లేవా అని మాస్టర్ చెక్ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జరిపోతుల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ బొల్లం కుమార్, డిఆర్పి కల్పన, వీఎస్ఏ జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కవిత, టి. ఏ నాగిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ రమేష్, ఫీల్ అసిస్టెంట్ లక్ష్మణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సమన్వయంతో కృషి చేయాలి:జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ

**నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి ఫిబ్రవరి16:**
ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని నారాయణపేట జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి లో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పి చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హాజరయ్యారు.ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు తమ తమ మండలాల పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. ఉట్కూరు జెడ్పిటిసి సభ్యులు అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా కొంతమంది రైతులకు రైతుబంధు నగదు జమ కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ ను ప్రశ్నించగా..ఈ నెలాఖరు వరకు రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లో జమ అవుతుందని జాన్ సుధాకర్ తెలిపారు.రైతుబంధు సాయం ఎన్ని ఎకరాల వరకు కట్ చేసే అవకాశం ఉందని కో ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్ అడగగా ప్రభుత్వం రైతు భరోసా పథకానికి సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందిస్తుందని, ప్రస్తుతానికి గత సీజన్లో మాదిరిగానే రైతులకు నగదు సాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేస్తుందని జాన్ సుధాకర్ తెలిపారు.దామరగిద్ద ఎంపీపీ బక్క నరసప్ప మాట్లాడుతూ దామరగిద్ద లో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటుతున్నారని, తీగల కింద కాకుండా వాటి పక్కలో మొక్కలు నాటాలని కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేయబోయే గృహ జ్యోతి పథకానికి 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ఏదైనా రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు అర్హులని, ఇప్పటికే లక్ష మందిలో 65 వేల మంది కి గృహ జ్యోతి పథకం అమలు కోసం లింకప్ చేయడం జరిగిందని, మిగతా వారికి కూడా లింక్ ఆఫ్ చేస్తామని చెప్పారు. గృహ జ్యోతి పథకాన్ని ప్రతి ఒక్కరికి అమలు చేయాలని జెడ్పిటిసి సభ్యులు అశోక్ కోరారు. రేషన్ కార్డు లేని వాళ్ళు గృహ జ్యోతి పథకానికి అర్హులు కారా అని మాగనూరు జడ్పిటిసి వెంకటయ్య ప్రశ్నించగా, స్పందించిన విద్యుత్ శాఖ అధికారి గైడ్లైన్స్ ప్రకారం రేషన్ కార్డు తప్పనిసరి అని, రేషన్ కార్డు లేని వాళ్ళు కొత్త రేషన్ కార్డు తీసుకున్న తర్వాత గృహ జ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నర్వ జడ్పిటిసి సునీత మాట్లాడుతూ.. ఇటీవల చిన్నపిల్లలో గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయని, మండలాల వారిగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గుండెపోటు నివారణ పై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. దామరగిద్దలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మింప చేసిన ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలను కొనసాగించాలన్నారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, రోగులకు వైద్య సేవలు సమయానికి అందడం లేదని, చిన్న రక్త గాయంతో ఆస్పత్రికి వెళ్తే మహబూబ్ నగర్ కు రెఫర్ చేస్తున్నారని సభ దృష్టికి తీసుకురాగా, స్పందించిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంజిత్ కుమార్ వైద్య సేవలు అందిస్తున్నందుకే జిల్లా ఆసుపత్రి పనితీరు (ఫర్ఫామెన్స్) రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఆస్పత్రిలో తాము మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఊట్కూరు, మక్తల్, మాగనూరు ఎంపీపీలు తమ మండలాల పరిధిలో తాగునీటి సమస్య నెలకొందని, వేసవికాలంలో సమస్య మరింత



జఠలమయ్యే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మద్దూర్ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థాయిలో బోర్లు వేసేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... ఎంపీపీలు, జడ్పిటిసిలు తమ ఈ పదవి కాలంలో అభివృద్ధి పనుల విషయంలో జిల్లా అధికారులకు సహకరించారని, జిల్లా అధికారుల తరపున అందరికీ శుభాభినందనలు తెలిపారు. ఇక తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ వారిగా మిషన్ భగీరథ ఎంట్రా సిబ్బందితో పనులు చేయించు కోవచ్చని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన రెండో దఫా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ, షెడ్యూల్ కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా ముఖ్య ప్రణాళిక, గనులు భూగర్భ శాఖ, చేనేత జోలి శాఖ, ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ, పౌర సరఫరాల శాఖ, దేవాదాయ శాఖ, వెనక బడిన తరగతులు సంక్షేమ శాఖ, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు తమ తమ పరిధిలోని ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో శైలజ, డిప్యూటీ సీఈఓ జ్యోతి, ఆయా ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, జెడ్పీ కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## రాయపోల్ మండలాన్ని గజ్వేల్ రెవిన్యూ డివిజన్లోనే ఉంచాలి

- మండల సర్వసభ్య సమావేశం లోఏకగ్రీవ తీర్మానం చేసిన ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్
- గ్రామాల్లో సమస్యలను పరిష్కరించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే
- నిర్లక్ష్యంగా వ్యావారించే అధికారులపై చర్యలు తప్పవు: ఎంపీడీవో బాలయ్య
- అందరి సహకారంతో మండల అభివృద్ధి లక్ష్యం: ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్

**రాయపోల్ ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి)**
ప్రజల ఆకాంక్ష మేరకు రాయపోల్ మండలాన్ని గజ్వేల్ రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని శుక్రవారం జరిగిన రాయపోల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఎంపీపీ అధ్యక్షురాలు కల్లూరి అనిత శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి జడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి. ఆయా గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల సమావేశంలో వివిధ శాఖ అధికారులు వారి వారి నివేదికలను సభ్యుల సమక్షంలో వివరించారు. ఈ క్రమంలోనే మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్ అహ్మద్ మాట్లాడుతూ రాయ-పోల్ మండలాన్ని గజ్వేల్ రెవిన్యూ డివిజన్ లో ఉంచాలని రాయపోల్ మండల ప్రజలకు ఇబ్బంది కాకుండా ఉంటుందని ఆయన అన్నారు దుబ్బాక డివిజన్లో రాయపోల్ మండలాన్ని కలిపితే 40 కిలోమీటర్ల దూరంతో పాటు అనేక ఇబ్బందులు




రాయపోలు మండల ప్రజలు పడతారని ఆయన అన్నారు రాయపోల్ మండలాన్ని గజ్వేల్ డివిజన్లోని ఉంచాలని సర్వసభ్య సమావేశంలో సభ్యులు తోపాటు ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ మండల కోఆప్షన్ సభ్యులు ఫర్వేజ్ అహ్మద్ జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి సమావేశంలో తీర్మానం చేశారు . అయితే రాయపోలు కూడా దుబ్బాక రెవిన్యూ డివిజన్ లో కలిపితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో కష్టమవుతుందన్నారు. గజ్వేల్ పది కిలోమీటర్లు ఉండగా. దుబ్బాక 40 కిలోమీటర్లు ఉంటుందని ప్రజలకు గోస తప్ప మేలు కాదన్నారు. ఈ నేపథ్యంలో మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులందరూ ఏకగ్రీవ తీర్మానం చేస్తూ రాయపోల్ మండలాన్ని గజ్వేల్ రెవిన్యూ డివిజన్లోనే ఉంచాలని సభ్యులందరూ తీర్మానం చేశారు. తమకు సమాచారం లేకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వివరిస్తే ఊరుకునేది లేదని ప్రజా ప్రతినిధులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. కాగా మండల సమావేశం జరుగుతున్నప్పుడు పంచాయతీ కార్యదర్శులు తీసుకొని బయటకు వెళ్లడం పట్ల ఎంపీడీవో బాలయ్య వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశం జరిగినంత సేపు ప్రతి అధికారి కచ్చితంగా సమావేశంలో ఉండాలని. ప్రతి మండల స్థాయి అధికారి సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీపీ అనిత శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా ప్రత్యేక అధికారులు ఇస్తా రాజ్యాంగ వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని పేర్కొన్నారు. జడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచుల పదవి కాలం పోయిందని ఉన్నది ఎంపీటీసీలు తానేనని ఈ విషయాన్ని మండల జిల్లా స్థాయి అధికారులు గ్రహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికీ మండల అధికారులు ప్రోటోకాల్ లభించారని ఇప్పటికైనా అది పద్ధతులు మార్చుకొని ఎన్నికల్లో గెలిచిన తమకు సముచితస్థానం కల్పించాలని. తమ వైపు నుంచి వారికి కూడా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బాలయ్య. తాసిల్దార్ దివ్య. మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్ అహ్మద్. ఎంపీటీసీలు ఇట్లు వెంకటయ్య లక్ష్మి మండల విద్యాధికారి నర్సవ. పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ బల్ల మహారాజ్. అంగన్వాడి సూపర్వైజర్ షబానా. విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు. వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామాల ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలలో రాణిస్తున్న జంగిలి మల్లేశం

**చేర్యాల ప్రజాజ్యోతి :** సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజేరు గ్రామానికి చెందిన జంగిలి మల్లేశం తెలంగాణ రాష్ట్రంలో క్రీడలలో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆయనను ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ముందుకు పోత అంటున్నారు. జంగిలి మల్లేశం 2024 జనవరి 26న హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ డబ్ల్యూ పీసీ తరపున పోటీలో పాల్గొని మాస్టర్



కేటగిరీలో పాల్గొని బెంచ్ ప్రెస్ లో 65 నుండి 70 కిలోలు లేపి 100 కిలోల డెడ్ లిఫ్ట్ చేసి మాస్టర్ కేటగిరీలో ప్రధాన స్థానంలో నిలిచారు. మద్దూరు మండలంలోని మారుమూల పల్లెటూరులో జన్మించి వృత్తిరీత్యా హైదరాబాద్ లోని లేజర్ సేవింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఈ స్థాయికి రావడం పట్ల ఆయనను శుక్రవారం చేర్యాల బీరప్ప దేవాలయం వద్ద కురుమ సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. సన్మానించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య, కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఓరుగంటి శంకర్, ప్రధాన కార్యదర్శిలు అందె నాని బాబు, కార్యదర్శి జంగిలి యాదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఈరి భూమయ్య, యాదవ సంఘం జిల్లా నాయకుడు కర్రె నర్సింహులు, కురుమ సంఘం మండల నాయకుడు సూర్ణ శ్రీకాంత్, మేక యాదగిరి, బండారి అంజయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి,పాల్గొన్నారు.

## కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

**- కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల నాయకులు**

**కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలి**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి):** దేశ వ్యాప్త సమ్మె



గ్రామీణ బంద్ లో భాగంగా శుక్రవారం మంచాల మండలంలో కార్మిక రైతు వ్యవసాయ సంఘాల నాయకులు వివిధ గ్రామాల్లో బంద్ నిర్వహించి సమ్మెలో సమ్మెలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించారు. అనంతరం ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మోడీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ప్రజలపై తీవ్ర భారాలను మోపుతున్నారని అన్నారు. కార్మిక చట్టాలను బలహీనం చేసే నాలుగు రకాల లేబర్ కోడ్ లను సిద్ధం చేసి కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు తెచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. లేని యెడల దేశవ్యాప్తంగా పోరాటం ఉదృతం చేసి బిజెపి ప్రభుత్వం మెడలు వంచుతమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ, జిపి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యర పాండు, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శేఖర్ రెడ్డి, రావుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో రైతులపై బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వ దమనకాండ శోచనీయం

### రైతు చట్టాలు వెంటనే అమలు చేయాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్ డిమాండ్

### అఖిల పక్షం ఆద్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో

**హుస్నాబాద్, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి):** దేశ వ్యాప్తంగా ఇచ్చిన బందు పిలుపు మేరకు శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో సిపిఐ, బిఎస్పీ, రైతు ఐక్య వేదిక మద్దతుతో అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టుపార్టీ సిపిఐ రాష్ట్ర సమితి



సభ్యులు, మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వ అదికారంలోకి వచ్చిన నాటి నుండి దేశంలో రైతులు పండించే 22 రకాల పంటల ధాన్యంకు మద్దతు ధర పార్లమెంట్ లో చట్టబద్ధత చేయాలని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సూచనలను పూర్తి స్థాయిలో అమలు చేయాలంటు 2020–21 దేశవ్యాప్తంగా రైతుల ఉద్యమంలో అసువులు బాసిన 700 మంది రైతులకు ఒక్కొక్క కుటుంబానికి 25 లక్షలు ఇవ్వాలని రైతులకు వ్యవసాయ కార్మికులకు పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు పంటలు పండే వ్యవసాయ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ పారిశ్రామిక రంగానికి కేటాయించవద్దని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు దేశ ప్రజలు ముందుకు రావాలని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎన్నికల్లో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నేటి యువత ముందుండి నడవాలని కోరారు. రైతు సంఘం ఐక్య వేదిక నాయకులు పచ్చిమట్ల రవిందర్ మాట్లాడుతూ కార్మికులకు కార్మిక చట్ట ప్రకారం 26 వేల జీతం, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడం, పర్మినెంట్ చేయడం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఆదివారం సెలవు ఇవ్వడం, ప్రసూతి సెలవులు, ప్రమాదంలో చనిపోతే 25 లక్షలు, ప్రమాదంలో చనిపోతే అర్హులైన వారికి ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేయాలని పచ్చిమట్ల రవిందర్ ప్రభుత్వానికి సూచించారు. బిఎస్పీ జిల్లా నాయకులు ఎలగందుల శంకర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. రైతుల ఉద్యమం సమయంలో కేసులు పెట్టిన ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు మాజీ మార్కెట్ డైరెక్టర్ గొర్ల వెంకన్న, పాలకేంద్రం డైరెక్టర్ కాశవేణి మల్లేశం, రాగుల కనకయ్య, గొర్ల వెంకటయ్య, గొర్ల ఐలయ్య, సుంకరి మల్లయ్య, సుంకర రాజయ్య, బిఎస్పి నాయకులు వెల్పుల రాజు, రుద్రవరం శరత్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొయ్యడ కొమురయ్య, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజు కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, రైతు సంఘం మండల ఉపాధ్యక్షురాలు జంగ విజయ, రైతు సంఘం హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు కాల్వల ఎల్లయ్య, సిపిఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి, పొదిల కుమారస్వామి,మౌటం బాలయ్య, ఇజ్జగిరి కిష్టయ్య, బింగి సమ్మయ్య, కవ్వ దేవేందర్ రెడ్డి, ఎర్రవెల్లి తిరుపతి, తొందురి రేవతి, రాయికుంట మంజుల, దొంతరవేని రజిత తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి
- నల్ల చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- రైతే రాజని పొగుడుతూ రైతు సంక్షేమం విస్మరిస్తుంది
- పెంచిన ధరలతో పేద ప్రజల జీవన విధానం అస్తవ్యస్తం
- గాలికి వదిలేసిన ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ
- ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేట్ శక్తుల పరం
- దేశవ్యాప్త బంద్, గ్రామీణ సమ్మెలో ప్రజా సంఘాలు
- అంబేద్కర్ చౌరస్తా వద్ద బైఠాయింపు, రాస్తారోకో

**యాచారం, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త బంద్, గ్రామీణ



సమ్మె నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉపాధి వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్మిక, కర్షక వర్గాలతో ఆ నాయకులు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వద్ద బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి మాట్లాడుతూ రైతే రాజని పొగుడుతూనే రైతులను విస్మరిస్తుందని బిజెపి ప్రభుత్వం గత ఏడాది తీసుకొచ్చిన నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ వేలాది మంది రైతులు చేపట్టిన నిరసన దరిమిలా 600 మంది రైతులు మృత్యువాత పడ్డారని అయినా బెదరకుండా నిర్వహించిన ఉద్యమాల ఫలితంగా చట్టాలను తాత్కాలికంగా వాయిదా వేశారు తప్ప పూర్తిగా రద్దు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లి హామీలను గాలికి వదిలేసిందన్నారు. మరోవైపు పేద ప్రజల జీవన విధానం నిత్యవసర వస్తువులతోనే ముడిపడి ఉందని కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం పట్టకుండా ఇబ్బడి ముబ్బడిగా నిత్యవసర వస్తువుల ధరలు పెంచడంతో ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడంతో దేశ ప్రజల ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టంలో మార్పులు ఎన్నో తీసుకొచ్చి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని అసంఘటితరంగాల్లో కార్మికులకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలన్నా సుప్రీంకోర్టు ఆదేశాలను ఎక్కడ అమలు పరచకపోగా చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని మరిచి ప్రజా వ్యతిరేక విధానాలకు



పాల్పడుతున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్షులు పి అంజయ్య, కెవిపిస్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. నర్సిహ్మా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి. బ్రహ్మయ్య సీఐటీయూ మండల కన్వీనర్ చందు నాయక్, రైతు సంఘం జిల్లా నాయకులు తావు నాయక్, జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశ్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. జంగయ్య, మాజీ వైస్ ఎంపీపీ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండులో వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలి

ఎంపీపీ కొప్పు సుకన్య భాష

**అధికారులతో కలిసి బస్టాండ్ ఆవరణలో వసతుల పరిశీలన**

**యాచారం, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలో ఇటీవల వినియోగంలోకి వచ్చిన బస్టాండ్ ఆవరణలో అరకొర వసతులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఇబ్బందుల దృష్ట్యా బస్టాండ్ లో కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య భాష పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం డిఎం నర్సప్ప ఇతర అధికారులతో కలిసి ఎంపీపీ బస్టాండ్ ఆవరణలో వసతులు పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ బస్టాండ్ లో నిత్యం ప్రయాణికుల రద్దీ పెరుగుతోందని రద్దీ దృష్ట్యా బస్టాండ్ ఆవరణలో కనీస వసతులు లేకపోగా ప్రయాణికులు



ఇబ్బందులు పడుతున్నారని డిఎం దృష్టికి తీసుకొచ్చారు. బస్టాండ్ ఆవరణలో వచ్చిపోయే బస్సుల దుమ్ము, ధూళి ప్రయాణికులకు ఇబ్బందిని కలిగిస్తున్నాయని మూత్రశాలలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్ లో వసతుల కల్పనకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. డిపోను ఇప్పటికే వినియోగంలోకి తెచ్చామని వసతుల కల్పనతో డిపోను మరింత అభివృద్ధి చేస్తామని డిఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, విద్యుత్ ఏఈ సందీప్ కుమార్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గ్రామీణ భారత్ బంద్: శోభన్

**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి16(ప్రజాజ్యోతి):** కేంద్ర బిజెపి కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా గ్రామీణ భారత్ బంద్ కు మద్దతుగా శేర్లింగంపల్లి మండల పరిధిలోని సిఐటియు, ఎ ఐ టి యు సి, ఏ ఐ యు టి యు సి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చందానగర్ అంబేద్కర్ విగ్రహం నుండి లేబర్ అడ్డ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో కార్మికులు బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు .కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని , కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్



బిల్లులను రద్దు చేయాలని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా వామపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈరోజు బందును పాటిస్తున్నామని అందులో భాగంగా పెద్ద ఎత్తున ర్యాలీలు ధర్నాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలు రైతు వ్యతిరేక చట్టాలను కేవలం కార్పొరేట్ శక్తుల కోసం మాత్రమే తీసుకొచ్చిందని వారు ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని రైతులు చేస్తున్న పోరాటానికి తమ కార్మిక సంఘాల తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు ప్రకటించారు.ఇప్పటికైన కార్మికులకు రైతులకు ఉపయోగపడే చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ ర్యాలీలో కామ్రేడ్ సి, శోభన్,మాణిక్యం,కె. కృష్ణ, రామకృష్ణ,చెందు యాదవ్, తుకారాం దానయ్య, నారాయణ తదితరులు,అంగన్వాడీ కార్మికులు మున్సిపల్ కార్మికులు ఆటో హమాలీ కార్మికులు పాల్గొన్నారు

# మోడీ నియంతృత్వ పోకడలు మానుకోవాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

ట్రేడ్ యూనియన్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో షాద్ నగర్ లో భారీ ర్యాలీ రాస్తారోకో

**నందిగామ, ఫిబ్రవరి 16(ప్రజాజ్యోతి):** మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈరోజు షాద్నగర్ పట్టణంలో సమ్మెలో



ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎన్. రాజు మాట్లాడుతూ కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ప్రజలపై తీవ్ర భారాలను మోపుతుందన్నారు. నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించడంలో వైఫల్యం చెందిందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానాన్ని గాలికి వదిలేశారు. రైతంగం కోరుకున్న కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంలో హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి 300 రోజులు పని కల్పించేలా ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారు స్తోందని కార్మిక చట్టాలను బలహీనం చేసే నాలుగు రకాల లేబర్ కోడ్ లను సిద్ధం చేసి కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు తెచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేకతను రాజకీయంగా ఎదుర్కోలేక రామాలయం ప్రారంభోత్సవాన్ని ముందుకు తెచ్చి హిందుత్వ రాజకీయాలతో ఓటు బ్యాంకు పెంచుకొని తిరిగి అధికారంలోకి రావాలని సిద్ధమవుతుందని విమర్శించారు. రైతులు కనీసం మద్దతు ధర రుణమాఫీ సహా ఇతర వ్యవసాయ సంస్కరణలకు చట్టపరమైన హామీని డిమాండ్ చేస్తూ రైతులు ఢిల్లీలో ఆందోళన చేయడానికి దేశ రాజధానికి రాకుండా పోలీసులను ఉపయోగించి టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించి చెదరగొట్టే ప్రయత్నం సరైనది కాదని కేంద్ర ప్రభుత్వం నుంచి చర్చలకు ఆహ్వానించి రైతులకు కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీతోపాటు స్వామినాథన్ కమిటీ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అదేవిధంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ మాట్లాడుతూ అన్నదాతల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే దేశవ్యాప్తంగా పోరాటం ఉధృతం చేసి బిజెపి ప్రభుత్వం మెడలు పంచుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ను అమలు చేయాలని నిత్యం ప్రజల ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని ప్రజలపై అధిక భారాలను పడకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్ ఆశ వర్కర్స్ జిల్లా కోశాధికారి చెక్కల లలిత ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటప్ప ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రీజియన్ కార్యదర్శి వెంకటయ్య బీసీ డబ్ల్యూ నాయకులు మైలారం జంగయ్య రాజు శీను లోకల్ హమాలీ సంఘం శ్రీను ట్రాన్స్ పోర్ట్ రంగా కార్మికుల మల్లేష్ దశరథ్ లారీ మెకానిక్ అసోసియేషన్ నాయకులు టూవీలర్ అసోసియేషన్ నాయకులు దశరథ్ వెంకటేష్ మండల తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు. జంగయ్య తోట చంద్రయ్య సరిత యాదమ్మ గ్రామపంచాయతీ జంగయ్య సురేష్ సత్తెమ్మ కృష్ణ సిద్ధమ్మ సిఐటియు నాయకులు కావాలి రాజు మీది పేట రాజశేఖర్ సిపిఎం నాయకురాలు ఎస్ లక్ష్మి అంగన్వాడి టీచర్లు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మోటార్ బైక్ అసోసియేషన్ నాయకులు యాదయ్య రాజు సురేష. నాట్ కో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మల్లేష్ సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ,కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 16(ప్రజా జ్యోతి )** దేశవ్యాప్తంగా రైతు,కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా నేడు కుత్బుల్లాపూర్ లో షాపూర్ నగర్,ఐడీపీఎల్,బాచుపల్లి, గండి మైసమ్మ లో కార్మికులు పెద్దయెత్తున ర్యాలీ నిర్వహించి జయప్రదం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ అధ్యక్షుడు అశోక్ లు పాల్గొని మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరుస్తూ పేద, మధ్య తరగతి ప్రజల పై ధరల భారం పెంచుకుంటూ రైతులను,కార్మికులను కొత్త చట్టాల పేర మోసం చేస్తున్నారని అన్నారు.రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా కార్పోరేట్ శక్తులకు మాత్రం అనేక రాయితీలను కల్పిస్తూ రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కనీస పని గంటలు, కనీస వేతనాలు లాంటి చట్టాలను తొలగించి యాజమాన్యాల కు ఉపయోగపడే చట్టాలను తీసుకువచరని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్, సీఐటీయూ కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ లు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం డ్రైవర్లు ప్రమాదం చేస్తే 10 సంవత్సరాల జైలు శిక్ష,7 లక్షల జరిమాన విధించడం అనేది పిచ్చి ఆలోచనని వెంటనే ఇలాంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్,ఏఐటీయూసీ,సీఐటీయూ నాయకులు రాము,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాములు,ఆటో యూనియన్ నాయకులు కుమార్,ఎల్లస్వామి, చందర్, పూర్ణచందర్, ప్రభాకర్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు నాగప్ప, సామెల్,రవి,యాదగిరి,ప్రభాకర్, బాలరాజ్,మునిసిపల్ నాయకులు రాములు,పీటర్, నాయకులు సుంకిరెడ్డి,జెర్జ్,మహేందర్, కనకయ్య,చంద్రమౌళి, శ్రీనివాస్, గురప్ప,బాలాజీ తో పాటు వందలాది కార్మికులు పాల్గొన్నారు షాపూర్ నగర్ మార్కెట్ నుండి ఉషోదయం వరకు ఏఐటీయూసీ మరియు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఐడీపీఎల్ చౌరస్తా వద్ద ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చెయ్యడం జరిగింది.

# మోడీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేస్తాం

ఓబిసి రైట్ ప్రొటెక్షన్ ఫోరమ్ నేత ఆళ్ల రామకృష్ణ

బీసీ కుల గణన బిల్లు పెట్టడం హర్షణీయం.. బషీర్బాగ్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) :** రాహుల్ గాంధీ ఆషయ సాధనలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బిసి కుల గణన బిల్లు పెట్టడం చారిత్రకమైన దినం అని ఓబిసి రైట్ ప్రొటెక్షన్ ఫోరమ్ నేత ఆళ్ల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్బాగ్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నోసార్లు కులగణన చేస్తానని ఈ మద్యనే సుప్రీంకోర్టుకి మా వల్ల కాదని చెప్పడం జరిగిందన్నారు. బీసీలను మోసం చేసిన మోడీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేయడానికి భారత దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.



బీహార్లో కులగలను జరిగినప్పటికీ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చ జరిగిన తీరు అద్భుతం అన్నారు. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రతి మాటకి చక్కని జవాబులు చెబుతూ కులగణన ఎలా చేయాలి, తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మెజార్టీ వర్గాలు, మైనార్టీ వర్గాలు, అగ్రకులాల్లోని పేదలకు లబ్ధి చేకూరే విధంగా కులగణన శాస్త్రీయబద్ధంగా చేయాలని వారు తీసుకున్న నిర్ణయం దేశంలోనే చారిత్రాత్మకం అన్నారు. ఇంత సమగ్రంగా అందరి అనుభవాలతో బిల్లు పెట్టడం పట్ల నాలుగు కోట్ల మంది హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాల నిర్వహణ

**- ఎంపీటీసీ చీరాల రమేష్**
**- వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ**
**- ఈనెల 22 నుంచి 26 వరకు ఉత్సవాలు**

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి):** కన్నుల పండుగగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని బ్రహ్మోత్సవాలను పూర్వం కంటే మరింత



వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపడుతున్నామని ఎంపీటీసీ చీరాల రమేష్ అన్నారు. ఆరుట్లలో వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఎంపీటీసీలు చీరాల రమేష్, కావలి శ్రీనివాస్, ప్రత్యేక అధికారి, ఎంపీడీవో బాలశంకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ ఇతరుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రమేష్ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 26 వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూ-ర్తవుతున్నాయని భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయని అన్నారు. పిఎసిఎస్ డైరెక్టర్ లు జనార్దన్ రెడ్డి, కందల శ్రీశైలం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యండి జాని పాష మాజీ సర్పంచ్ లు సుంకరి పాండరీ, ఆనంగాళ్ల యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ పాండాల జంగయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లయన్ జైన రమేష్ కు లయన్స్ అంతర్జాతీయ లీడర్ షిప్ అవార్డ్

**జనగామ, ఫిబ్రవరి 16( ప్రజాజ్యోతి):-** జనగామ లయన్స్ క్లబ్ సంస్థ సభ్యుడు రీజియన్ 7, జోన్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న లయన్ జైన రమేష్ కి 2023-24 సంవత్సర కాలం లో అతని యొక్క సేవలని గుర్తించి లయనిజం మిషన్ 1.5 ఉద్యమం కొరకు ప్రదర్శించిన లీడర్ లక్షణాలకు గాను లయన్స్ అంతర్జాతీయ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పట్టి హిల్ అంతర్జాతీయ లీడర్షిప్ అవార్డు ప్రకటించింది. వారు ఈ అవార్డ్ తో పాటు ఒక ప్రేరణ




కలిగించే సందేశాన్ని అందించారు. ఆ సందేశంలో మీరు చేసే అత్యున్నతమైన సేవలు అవసరార్ధులకి ఎంతో మేలు కలిగించి మన యొక్క సమాజానికి ఇతర లయన్ సభ్యులకు ప్రేరణ కలిగించడం లో మీ పాత్ర చాలా విలువ అయ్యింది. మీరు మా యొక్క స్లోగన్ ప్రపంచాన్ని మార్పు చేద్దాం మనం అనే దానిని కర్తవ్య నిర్వహణ చేశారు. నా యొక్క వ్యక్తిగత శుభాకాంక్షలు మీకు తెలియచేస్తూ భవిష్యత్తు లో మీరు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరుతూ మానవతా దృక్పథంతో సమాజంలో అన్ని రకాల ప్రజలకి సేవలు అందించాలని వారు కోరడం జరిగిందని రాశారు. ఈ అవార్డుని గురువారం రాత్రి హన్మకొండలో జరిగిన 320ఎఫ్ జిల్లా క్యాబినేట్ సమావేశం లో పూర్వ జిల్లా గవర్నర్ల చేతుల మీదుగా రమేష్ కి ప్రదానం చేశారు. అంతర్జాతీయ అధ్యక్షురాలు ప్రకటించిన ఈ అవార్డు రమేశ్ కు లభించడం చాలా గొప్ప విషయం అని తక్షణ పూర్వ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు అన్నారు. అరుదైన ఈ అవార్డు మా క్లబ్ సభ్యులకు రావడం చాలా ఆనందంగా ఉ ందని జనగామ క్లబ్ కు చెందిన పూర్వ జిల్లా గవర్నర్ కాసం అంజయ్య అన్నారు. ఈ యొక్క అవార్డు రావడంలో జిల్లా గవర్నర్ ఎన్. వెంకటేశ్వర రావు ప్రోత్సాహం అభినందనీయమని పూర్వ జిల్లా గవర్నర్ ముచ్చా రాజి రెడ్డి అంటూ అవార్డ్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్లు రీజియన్ చైర్మన్ లు రాపాక విజయ్, కె. రాజశేఖర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ చైర్మన్ కృష్ణ జీవన్ బజాజ్, లియో చైర్మన్ గంగిషెట్టీ ప్రమోద్, జిల్లా అడ్మినిస్ట్రేటర్ చంద్రగిరి ప్రసాద్, క్యాబినెట్ సభ్యులు ఇతర జోన్ చైర్మన్లు రీజియన్ చైర్మన్లు, డాక్టర్ మాచర్ల బిక్షపతి,జిల్లా కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

# స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

- కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలి.
- రైతన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి: సిఐటియు జిల్లా నాయకులు రమేష్ గౌడ్.

**మునిపల్లి ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి)** స్కీం వర్కర్లకు పర్మినెంట్ చేయాలని కనీస వేతనం రూపాయలు 26 వేలకు పెంచాలని రైతన్నకు గిట్టుబాటు ధర కల్పించాలని సిఐటియు జిల్లా నాయకులు రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున దేశ వ్యాపిత కార్మికుల సమ్మె గ్రామీణ బంద్ సందర్భంగా మునిపల్లి మండలంలోని బుదేరా చౌరస్తాలోని 65 జాతీయ రహదారిపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లే కార్డులతో రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయిన నేటికీ కార్మిక వర్గం ,రైతాంగ సమస్యలు పరిష్కరించడం లేదని, రోజురోజుకు నిత్యవసర ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజానీకం బ్రతకలేని పరిస్థితులలో ఉన్నారని చీలిచాలని వేతనాలతో స్కీం వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు

కేంద్రప్రభుత్వంబడాకార్పొరేట్లకు 2.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ మాకు చేసిన బిజెపి ప్రభుత్వం, రైతులకు మాత్రం రెండు లక్షల రుణమాఫీ చేయడం లేదు, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయని యజమాన్యాలపై చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలకు రక్షణ కల్పించి, అంగన్వాడి ఆశ మధ్యాహ్న భోజనం, వీఎవోలు, గ్రామపంచాయతీ, స్కీం వర్కర్లందర్నీ పర్మిట్ చేయాలని. వారికి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతాంగ సమస్యలను పరిష్కరించి పెరిగిన ధరలను అరికట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుమార్. ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు సంగీత




నిర్మల లలిత సావిత్రి మంజుల జయసుధ విజయలక్ష్మి పున్నెమ్మ పెంటమ్మ. వివో ఏల సంఘం మండల అధ్యక్షులు మొగులయ్య లింగమయ్య రాణి స్వప్న దివాకర్ నాగరాజు నాగమణి. గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్ మండల అధ్యక్షులు విట్టల్ గౌడ్ నర్సింలు రవి కృష్ణ శ్రీనివాస్ లక్ష్మమ్మ, ఆటో యూనియన్, ఉపాధి హామీ కూలీలు, రైతులు కార్మికులు, వృత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధన

## సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం

**పాలకుర్తి,ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి)** పోరాడి సాధించుకున్న తమ హక్కుల సాధన కోసం కార్మికులు కర్షకులు సంఘటితంగా పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న. రైతు సంఘం జిల్లా




ఉపాధ్యక్షులు మాచర్ల సారయ్య లు అన్నారు. శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో దేశవ్యాప్త కార్మికుల సమ్మె (గ్రామీణ భారత్ బంద్ ను పురస్కరించుకొని) గుడివాడ చౌరస్తా నుండి రాజీవ్ చౌరస్తా వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ తీశారు. అనంతరం వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్గ్ లాగా మార్చిందని మండిపడ్డారు. ఇప్పటికైనా రద్దు చేసిన కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక కనీస వేతనాలు 26000 ఇవ్వాలని ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలన్నారు. ప్రజా పోరాటాలతో పాటు పార్లమెంటులో వామపక్షాల కృషి వల్ల వచ్చిన ఉపాధి హామీ పథకం వల్లనే. ఈ పథకాన్ని కూడా ఎత్తివేయాలని బిజెపి ప్రభుత్వం కుట్రలు పండుతోందని. కూలీలకు జీవన ఆధారంగా ఉన్న ఈ పథకానికి బడ్జెట్ తగ్గించారు అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించేందుకు నిరాకరిస్తూ. ప్రతి వ్యక్తికి 200 రోజుల పని 600 రూపాయలు రోజువారి వేతనం ఇవ్వాలన్నారు. 2014 స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటకు ఎంఎస్పి (మినిమం సపోర్ట్ ప్రైస్) చెల్లిస్తాం అన్న హామీని బిజెపి ప్రభుత్వం నిలబెట్టుకో లేదన్నారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఏసి టూ ప్లేస్ 50 శాతం ఉండేలా చట్టబద్ధత కల్పించాలని. కేరళ తరహా రుణ విమోచన చట్టం తీసుకురావాలని. అన్ని బ్యాంకింగ్ సంస్థల నుండి ఒకేసారి రుణమాఫీ చేయాలని. విద్యుత్ (సవర్ణ )చట్టం ద్వారా విద్యుత్ రంగ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని మూడు రైతు చట్టాల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని సుదీర్ఘ



కాలంగా సంయుక్త మోర్చా కిసాన్ చేస్తున్న డిమాండును పట్టించుకోవడంలేదని కార్పొరేట్ అనుకూల నయా ఉధరవాద ఏజెండను దూకుడుగా ముందుకు తీసుకెళ్తూనే కార్పొరేట్ మతోన్మాద శక్తుల వైఫల్యాలు ప్రజల రోజువారి సమస్యలు దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు అన్నారు.

ఈ సందర్భంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు రెడ్ ఫ్లాగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాన్యపు బుజేందర్ పాల్గొని మాట్లాడారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమసత్యం, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బత్తిని వెంకన్న, తెలంగాణ రజక వృత్తిదాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి మదర్, జిల్లా నాయకులు బసవ రామచంద్రం, నూనె ముంతల యాకన్న, పి రమేష్, మాసం పెళ్లి నాగయ్య, పనికిరా రాజు, ఎడ్ల బిక్షపతి, మంద సంపత్, రాము,అంబటి సోమయ్య, కుమార్, కే సోమన్న, పి రమేష్, సుందర్, పరశురాములు, మూస్కు ఇంద్రారెడ్డి, పరశు రాములు, ఇంటి వెంకట్ రెడ్డి, తూర్పాటి సారయ్య, కొంగరి సుధాకర్, వెంకన్న, శ్రీను, ఐలయ్య, సాంఘికర్ణాకర్, జి సుశీల, ఏ ఎల్లమ్మ,సిహెచ్ యాకమ్మ, సోమయ్య, సైదులు, ఉపేంద్ర, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ముస్త్యాల లో గంజాయి పట్టివేత

## గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసిన చేర్యాల పోలీసులు

**చేర్యాల ప్రజాజ్యోతి :** చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామం లో శుక్రవారం గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు చేర్యాల పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు మ-స్త్యాల గ్రామ స్మశాన వాటిక వద్ద సి ఐ.యల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మద్దూరు ఎస్సై యునుస్ అహ్మద్ గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని చేర్యాల పోలీస్టేషన్ కు తరలించారు. అనంతరం నిర్వహించి న మీడియా సమావేశంలో నిందితులను అరెస్ట్ చూపి సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వారి వద్ద నుండి 74 గ్రాముల గంజాయితోపాటు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపుతున్నట్లు తెలిపారు. మరెవరైన గంజాయి అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఏఎస్ఐ నవీన్, కానిస్టేబుల్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు



# విద్యార్థులకు అంతుచిక్కని వ్యాధులు

– స్నానాలు చేస్తే దద్దుర్లే

– ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు





**తాండూర్ ఫిబ్రవరి 16 ప్రజా జ్యోతి:-** తాండూరు మండలం జీనుకుర్తి గేటు సమీపంలో కొనసాగుతున్న కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు అంతుచికిని వ్యాధుల బారిన పడుతున్నారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్లడంతో అసలు విషయం వెలుగులకి వచ్చింది. ఆసుపత్రికి చూపించిన తల్లిదండ్రులు విద్యార్థులకు ఎందుకు ఇలా వ్యాధులు వస్తున్నాయని ఆరా తీయగా పక్కనే ఉన్న జిప్సం కంపెనీ ద్వారా భూమిలోకి చొరబడిన పెడతాలతో నీటి జలాలు కలుషితం అయిపోయి ఇలా జరిగి ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాండూరు మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని తలారి చిట్టి తల్లి కమలమ్మ అనే బాలిక చేతులు కాళ్లపై వ్యాధి లక్షణాలు కనిపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోజు తాగే మినరల్ వాటర్ సైతం కలుషితమైన నీటిని తాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి వ్యాధులు వచ్చినా అక్కడి నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు రాక రెండు రోజుల నుంచి అవస్థలు పడుతున్న జీవన్గీ గ్రామస్తులు

**బషీరాబాద్ ఫిబ్రవరి 16 ( ప్రజా జ్యోతి)** బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామానికి ఆర్టీసీ బస్సు సుమారుగా రోజుకు తాండూరు డిపో నుండి జీవన్గి గ్రామానికి నాలుగైదు ట్రిపుల్ తిరిగేది, బుధవారం నుండి శుక్రవారం వరకు ఆర్టీసీ బస్సు రాక విద్యార్థులకు, ఇతర పనులకు వెళ్లే వారికి, ఉద్యోగస్తులకు, ఇబ్బందిగా ఏర్పడుతుంది, ప్రభుత్వం ఆర్టీసీ బస్సు లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఏర్పడినప్పటి నుంచి గ్రామాలలోకి బస్సులు సక్రమంగా రావడం లేదు వృద్ధులకు వికలాంగులకు ఎక్కడికి వెళ్లాలన్నా ప్రైవేటు వాహనాలు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు ఇప్పటికైనా జీవన్గి కి వచ్చే బస్సును ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా వెంటనే బస్సు వేయాలని డిపో మేనేజర్ గారిని గ్రామస్తులు మరియు ఈ రూట్ ప్రాంతంలో తిరిగే బషీరాబాద్, గంగ్వార్, క్యాద్గిర, ప్రయాణికులు కోరుతున్నారు.

# పార్లమెంట్ ఎన్నికలలో బిఅర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేద్దాం

– వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 16(ప్రజా జ్యోతి):** పార్లమెంటు ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేద్దామని వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం కోట్ పల్లి మండలం బార్వాద్ గ్రామం, బార్వాద్ తండా తో పాటు మద్గుల్ తండాలలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వచ్చే పార్లమెంటు ఎన్నికలలో బిఅర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చెయ్యాలన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్, బి ఆర్ ఎస్ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాస్

**ధారూర్ ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి)** తెలంగాణా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండల పరిధిలోని మైలారం గ్రామనికి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు.మంజూరు చేసిన నిధులతో శుక్రవారం నాడు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దులపల్లి దాస్ మైలారం వెనక తండాలో సీసీ రోడ్ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,శివరాం,దాచారం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా గ్రామీణ బంద్ విజయవంతం

– తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలిలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం



**కొడంగల్ ఫిబ్రవరి 16 ప్రజా జ్యోతి న్యూస్ :** కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సిపిఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా,నిరసన ర్యాలీ అంబేద్కర్ కూడలిలో చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ నియోజకవర్గ నాయకుడు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వికారాబాద్ జిల్లా నాయకుడు గంటి సురేష్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలనే పిలుపులో భాగంగనే గత పది సంవత్సరాలుగా కేంద్రంలో నీ బిజెపి ప్రభుత్వం దేశంలో అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవనాదాయం పడిపోయి పేదల సంఖ్య పెరిగిపోతున్నది. “ఆక్స్ ఫాం” నివేదిక ప్రకారం దేశంలో 80 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన మగ్గిపోతున్నారు. 2024 ఏప్రిల్ లో రాబోతున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర మోడీ ప్రభుత్వం తిరిగి రాయితీలను ప్రకటిస్తూ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నది. చారిత్రాత్మకమైన రైతాంగ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 3 వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు రాతపూర్వకంగా హామీలు ఇచ్చింది. ఈ కాలంలో వాటిని అమలు చేయకపోగా వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకున్నది. సహకార రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నది. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించలేదు. ఆందోళన సందర్భంగా చనిపోయిన 750 రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. ఉపా చట్టం పేరుతో రైతు నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళలో పెడుతున్నది. వామపక్షాల ఒత్తిడి వల్ల నచ్చిన ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు పూనుకుంటున్నది. బడ్జెట్లో క్రమంగా నిధులు తగ్గిస్తూ వస్తున్నది. కేంద్రం అశాస్త్రీయంగా నిర్ణయించిన కనీస మద్దతు ధరల కంటే తక్కువకు అమ్మడం వల్ల ఏటా రైతులు రూ.4. లక్షల కోట్లు నష్టపోతున్నారు. నేటికి పంటల ప్రణాళిక లేకపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడిరాక, అప్పులు తీరక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎన్సీఆర్బి రిపోర్టు ప్రకారం ఏటా పది వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఫలితంగా దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల్లో సగానికి పైగా రైతులవే ఉంటున్నవి. ఏటా దేశంలో 9 కోట్ల ఎకరాల్లోని పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే గత పది సంవత్సరాల కాలంలో కరువులు, వరదల వల్ల రూ.28,550కోట్ల విలువగల పంటలు రైతులు నష్టపోయార నీ కార్పొరేట్ల ఆదేశాలకు లొంగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విత్తన చట్టాలు చేయడానికి నిరాకరిస్తున్నారని నేటి వరకు విత్తన చట్టం పార్లమెంట్లో పెండింగ్లోనే ఉంద నీ ఇంకా ఎంత కాలం వేచి చూడాలని ఎద్దేవా చేశారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీల పిలుపులను ప్రజలందరూ భాగస్వాములై జయప్రదం గావించినందుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, శంకర్ నాయక్ , ఎరుకలి రాములు , బాబ్యానాయక్ , చందర్ నాయక్ , తులసి రామ్ , పాండ్యా నాయక్ ,మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ రేణుక శ్రీనివాస్



**ధారూర్ ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి)** వికారాబాద్ జిల్లా జెడ్పి చైర్ పర్సన్ పి,సునీత మహేందర్ రెడ్డి,సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.చేరిన వారిలో స్టేషన్ ధారూర్ మాజీ సర్పంచ్ రేణుక శ్రీనివాస్,గ్రామస్తులు సోమ్లా నాయక్,బావ సింగ్ నాయక్,బాల్ రాజు,రాము నాయక్,సుభాన్ జి,లకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయక్,జనరల్ సెక్రెటరీ యాదయ్య,గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతయ్య, ఉపాధ్యక్షులు జయేందర్, మైనార్టీ అధ్యక్షులు జావిద్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న

# పోలీస్ అధికారులు శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలి

– రౌడీ షీటర్స్, సస్పెక్ట్ లపై ప్రత్యేక నిఘా పెట్టాలి

– జిల్లా ఎస్పీ నంద్యాల కోటి రెడ్డి






**వికారాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 16(ప్రజా జ్యోతి):** జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు సున్నితమైన అంశాల గురించి తెలుసుకుని శాంతి భద్రతలపై దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బదిలీల సందర్భంగా బదిలీ అయినా డి.ఎస్.పి అధికారులు, ఇన్స్పెక్టర్ అధికారులు, సబ్ ఇన్స్పెక్టర్ అధికారులు వెంటనే తమ పోలీస్ స్టేషన్ ల పరిధిలలోని రౌడీ షీటర్స్, సస్పెక్ట్, ట్రబుల్ మంగర్స్ ల గురించి తెల్సుకొని శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కల్గకుండా చూడాలని, పోలీస్ స్టేషన్ పరిధిలలో ఏదైనా సమస్యలు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకోని రావాలని సూచించారు. అనంతరం ఎస్పీ పోలీస్ అధికారులతో గత నెల నేరాలకు సంబందించిన వివరాలను అడిగి తెల్సుకోవడం జరిగింది. ఎలాంటి ఫైల్స్ పెండింగ్ లో పెట్టవద్దు, కేసుల ఆన్లైన్ అప్లోడ్ నందు ఎలాంటి నిర్లక్ష్యం చెయవద్దు అని, రౌడీ షీటర్స్, సస్పెక్ట్ లపైన దృష్టి పెట్టాలని, రోడ్డు ప్రమాదల నివారణకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండి ప్రజలలో అవగాహననాలు కల్గించాలని అన్నారు. అనంతరం జిల్లా నుండి బదిలీపైన వెళ్లిన డి.ఎస్.పిలు ఇన్స్పెక్టర్ అధికారులకు శాలువాలు కప్పి, మేమంటోలు ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగస్థులకు బదిలీలు సర్వసధారణం ఎక్కడికి వెళ్లినా ప్రజా శ్రేయస్సే లక్ష్యం గా పెట్టుకొని పని చేసి పోలీస్ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ యు. రవీందర్ రెడ్డి , డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్ , పరిగి డిఎస్పీ కరుణసాగర్ రెడ్డి, వికారాబాద్ డి ఎస్ పి గా పని చేస్తూ బదిలీపైన వెళ్తున్నా నర్సింహులు , తాండూర్ నుండి బదిలీపైన వెళ్తున్నా శేఖర్ గౌడ్ , తాండూర్ కి బదిలీపైన వచ్చిన బాలకృష్ణ రెడ్డి , జిల్లా సైబర్ సెక్యూరిటీ వింగ్ బదిలీపైన వెళ్తున్నా డి.ఎస్.పి హనుమంత్ రావు ఆర్ డి ఎస్ పి వీరేష్ ,ఇన్స్పెక్టర్ లు, ఆర్ ఐ, ఎస్సై లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మోమిన్ పేట్ మండల పరిధిలోని

# గౌతమ్ మోడల్ స్కూల్‌లో రథసప్తమి మహోత్సవం



**మోమిన్ పెట్ ఫిబ్రవరి 15. శుక్రవారం ప్రజా జ్యోతి.** ఉదయం 9 గంటల సమయంలో రథసప్తమి మహోత్సవం శ్రీ శ్రీలత శ్రీనివాస్ రెడ్డి కరస్పాండెంట్ సూర్య భగవానునికి జ్యోతిని వెలిగించి కార్యక్రమం ప్రారంభించబడినది. కార్యక్రమంలో బాలబాలికలు సూర్య నమస్కారాలు ప్రదర్శనలు మంత్ర యుక్తంగా మిత్రయ నమః అను 13 శ్లోకాలు పఠిస్తూ సూర్య నమస్కారాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి శ్రీ కే. వీరయ్య ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తూ చీకట్లను తొలగించి సమస్త లోకాలకు వెలుగులు పంచేవాడు సూర్య భగవానుడు, ఉదయ బ్రహ్మ దేవుడిగా, మధ్యాహ్న మహేశ్వరుడిగా, సాయంకాలం విష్ణువుగా సూర్యుడు త్రిమూర్తుల స్వరూపం అని మహా రుషుల భావన చేశారు. తెల్లటి ఏడు గుర్రాల రథంపై శ్వేత పద్మాన్ని ధరించి ధర్మానిచ్చే త్రిమూర్త్యాత్మకుడు సూర్యుడు సృష్టికి పూర్వమే ప్రత్యక్ష దైవంగా లోకానికి వెలుగును ఇచ్చిన నారాయణుడిగా ఆయనను ఆరాధించారు. సూర్యారాధన యుగయుగాల నుండి వస్తుంది. జీవులు 84 లక్షలకు సర్వదా కాపాడుతున్న భగవంతుడు సూర్య భగవానుడిని ప్రధానోపాధ్యాయులు శ్రీ కే. వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కే రవీందర్, శ్రీజ, మల్లేశ్వరి, నస్రీన్, భార్గవి, గీతావాణి, గాయత్రి, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

### మెడికల్ కాలేజీ నిర్వహణకు

# అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలి: జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష

**నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి ఫిబ్రవరి16:** నారాయణపేట జిల్లాలో మెడికల్ కాలేజీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లాలో కలెక్టర్ కోయశ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. నారాయణపేట జిల్లా మెడికల్ కళాశాల మంజూరు అయినందున త్వరలో తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నారాయణపేట లో అప్పంపల్లి లో మెడికల్ కళాశాల విద్యార్థుల కొరకు ప్రారంభించే తరగతుల గదులు ఇతర ఎర్పాట్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో మెడికల్ కళాశాల విద్యార్థులు తరగతులు ఈ అకాడమిక్ ఇయర్ లో ప్రారంభం కానున్నాయని అందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వ్యాపారస్తులపై దాడి చేసిన ఘటనకు నిరసన!

## పరిగి మార్కెట్ యార్డులో దుకాణాలు బంద్..



**పరిగి, ఫిబ్రవరి 16: (ప్రజా జ్యోతి)** వికారాబాద్ జిల్లా పరిగిలోని మార్కెట్ యార్డులో దుకాణాలను శుక్రవారం వ్యాపారస్తులు మూసివేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు పూర్తిగా కూరగాయల మార్కెట్ యార్డ్ గా మారిందని తమ దుకాణాలకు రావాల్సిన ట్రాక్టర్లకు, ట్రాన్స్ పోర్ట్ వాహనాలకు దారి లేకుండా చేశారని గ్రీన్ మర్చెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకరపు రాజు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు వ్యాపారస్తులపై ఆందోళనకు దిగుతున్నారని గత వారం అచ్చంపేట, మహబూబ్ నగర్ మార్కెట్ లలో వేరుశెనగాకు గిట్టు బాటు ధర కల్పించాలంటూ వ్యాపారస్తులపై దాడి చేసిన ఘటనకు నిరసనగా పరిగి మార్కెట్ యార్డ్ లో రైతుల దగ్గర నుండి పంటలను కొనుగోలు చేయకుండా మూసివేసామని తెలిపారు. అనంతరం పాలాద్రి శ్రీనివాస్, వీరేశం మాట్లాడుతూ పంటల కొనుగోలు మొత్తం ఆన్లైన్ రేటు ప్రకారం చేస్తున్నామని రేట్లు తగ్గించడం పెంచడం మా చేతిలో లేదని తెలిపారు. మార్కెట్ యార్డులో పంట కొనుగోలు కూరగాయల వ్యాపారం రెండు ఒకే చోట ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. కూరగాయల మార్కెట్లో ఇక్కడి నుండి తరలించాలని లేదంటే వచ్చేవారం కూడా దుకాణాలను ఇలానే బందు కొనసాగిస్తామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రథసప్తమి వేడుకలు

– ఏడుకొండల స్వామికి ఏడు వాహన సేవలు



**కొడంగల్ ఫిబ్రవరి 16 ప్రజా జ్యోతి** కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు నిర్వహించారు .ఉదయం 5:00 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతు ఆ దేవదేవుడు మొత్తం 7 వాహనాలపై భక్తులుకు దర్శనం ఇచ్చారు. తెల్లవారుజామున 5. 00 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనం.. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహన సేవ, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహన సేవ, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహన సేవ, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహన సేవ, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రథసప్తమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆ దేవదేవుని దర్శించుకుని తీర్థప్రసాదాలు గైకొన్నారు . ఆలయ ధర్మకర్తలు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ధర్మకర్తలు ఆలయ ఈవో, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య చికిత్స కోసం రూ పది వేలు ఆర్థిక సహాయం

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 16, (ప్రజాజ్యోతి):** ఓ పేద వ్యక్తి వైద్య చికిత్స కోసం రూ పది వేలు ఆర్థిక సహాయం అందచేసి మానవత్వం చూపారు మానవ సేవే మాధవ సేవ వాట్సాప్ గ్రూప్ సభ్యులు. వివరాలు ఇలా ఉన్నాయి. గౌతం నగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఇందిరా నెహ్రూ నగర్ కు చెందిన వినోద్ కుమార్(60) కి గతంలో కాలు ఇన్ఫెక్షన్ కావడంతో వైద్యులు అతని రెండు వేళ్ళు తొలగించారు. ప్రస్తుతం అతని కాలు ఇన్ఫెక్షన్ విషమించడంతో తన ఆర్థిక పరిస్థితి బాగోలేక వైద్య ఖర్చులకు తాళలేక మల్కాజిగిరి లోని ప్రభుత్వ దావా ఖానాలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని వినోద్ కుమార్ భార్య మానవ సేవే మాధవ సేవ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు కి తెల్పడం తో ఆయన స్పందించా డు. తన వాట్సప్ గ్రూప్ సభ్యుల సహకారంతో శుక్రవారం వినోద్ కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం 10, 000 వేల రూపాయ ల చెక్కుని బాధితుడికి అందజేశారు. తన భర్త వైద్యానికి సహాయం చేసిన మానవసేవే మాధవసేవ గ్రూప్ సభ్యులకు వినోద్ కుమార్ భార్య కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు,మహమ్మద్ రషీద్, ఉదారి సత్యనారాయణ యాదవ్, చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ సీనియర్ నేత జిల్లా శంకర్ గుప్తా కన్నుమూత





**మౌలాలి, ఫిబ్రవరి 16, (ప్రజాజ్యోతి):** మౌలాలి జవహర్ నగర్ కాలనీకి చెందిన సీనియర్ నేత , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి జిల్లా శంకర్ గుప్తా (72) శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఈసీఐఎల్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 6గంటలకు ఆయన కన్నుమూశారు. ఆయన కు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ పై ప్రత్యేక అభిమానంతో జిల్లా శంకర్ గుప్తా ఆ పార్టీలో చేరారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్త గా పార్టీ పటిష్టతకు అంకిత భావం తో ఆయన పని చేశారు. ఎన్ని ఆటు పోట్లు ఎదు రైనా ఏనాడూ ఆయన తెలుగు దేశం పార్టీని వీడలేదు. నాటి నుంచి నేటి వరకూ తెలుగు దేశం పార్టీ లో ఓ మంచి నాయ కుడిగా అంచలంచెలుగా ఎదిగారు ఆయన. తను చేస్తున్న సేవలను గుర్తించి 2009 సంవత్సరంలో జరిగిన జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జిల్లా శంకర్ గుప్తా భార్యకు మౌలాలి డివిజన్ టిక్కెట్ ఇచ్చి కార్పొరేటర్ గా పోటి చేసే అవకాశం కల్పించింది. ఆ ఎన్నికల్లో ఆయన సతీమణి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినా ఆయన ఏనా డూ నిరాశ చెందలేదు. నాటి నుంచి టీడీపీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేస్తూ ఆ పార్టీ లోనే కొనసాగుతు న్నారు. అందరితో కలిసి పోతూ పేదలకు తన వంతు సహాయం అంద చేస్తూ 'అజాత శత్రువు' గా ఆయన మంచి పేరు పొందారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆయనంటే తెలియని వారుండరు. దివంగత ఎన్టీఆర్ నుంచి, తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడుతో సైతం ఆయనకు మంచి అనుబంధం ఉ ంది. 'జిల్లా శంకర్ గుప్తా' హఠాన్మ రణం పట్ల వివిధ రాజ కీయ పార్టీల నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

# జోగులాంబ గద్వాల జిల్లా డిపిఆర్ఓగా ఎండి అరీఫుద్దీన్





**గద్వాల (ప్రజాజ్యోతి ప్రతినిధి) ఫిబ్రవరి 16 :** ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రభుత్వ పథకాలు ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేలా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ అన్నారు. శుక్రవారం జోగులాంబ గద్వాల్ జిల్లా కు జిల్లా పౌర సంబంధాల అధికారి గా బాధ్యతలు చేపట్టిన ఎం.డి అరీఫుద్దీన్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ మరియు అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి పూల బోకే అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ సిబ్బంది మరియు ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా డి.పి.ఆర్.ఓ కు స్వాగతం పలికారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం




**తొగుట ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి ):** తోగుట మండలంలోని వెంకట్రావు పేట గ్రామంలోని స్థానిక లిటిల్ బర్డ్స్ పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు .విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులుగా తమ ప్రాత్రలని పోషించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులుగా కె.రిత్వీక్ ,ఎంఈఓ గా వీ.మనోహర్, డిఈఓ గా టి . సాత్విక్, ఉపాధ్యాయ బృందం. ఇశ్రామహిన్, యాస్మిన్, తేజస్విని, నికిత, శరణ్య, అభిలాష్, మోజేష్, విజయ్, అయాన్, లవ కుమార్, ప్రదీప్, ఈశ్వర్ సాయి, ప్రసన్న, లోకేశ్వరి, కిషోరి, అయేషా, భావన, శ్వేత, నందిత, జేమ్స్ పాల్, వర్షిత, రాజా జోసెఫ్, యోహాన్, లు పాల్గొనడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి అశోక్ కుమార్ యాదవ్ మరియు ఉపాధ్యాయ బృందము ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం అయినది.

# మద్దూర్ తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి ఫిబ్రవరి16:** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల 50 మందికి కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేశామని తాహాశీల్దార్ జయరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రఘుపతి రెడ్డి ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ వెంకట్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నర్సింలు,కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవు గౌడ్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ మెంబర్‌గా ఎం రమేష్ మహారాజ్



**బషీరాబాద్ ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి)** తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ ఫైనాన్స్ కమిషనర్ గా రాజయ్య, మరియు స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ మెంబర్గా సుధీర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎం రమేష్ మహారాజ్ కు, మరియు నెహ్రూ నాయక్ మలోత్ మెంబర్గా నియమించడం జరిగింది, చైర్మన్ మరియు ముగ్గురు సభ్యులను తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనను తెలంగాణ గవర్నర్ తమిళ స్తై ఆమోదించడం జరిగింది, చైర్మన్ ,సభ్యులు,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపిన ఎం రమేష్ మహారాజ్, అదేవిధంగా స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ మెంబర్గా ఎం రమేష్ మహారాజ్ కు నియమించినందుకు బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి, బషీరాబాద్ మండల్ మాజీ జడ్పిటిసి రాకేష్ మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డిని
# సన్మానించిన ఎంపిటిసిల పోరం అధ్యక్షుడు కంకణాల నర్సింలు

**తొగుట ఫిబ్రవరి16( ప్రజా జ్యోతి ):** మండలంలోని వెంకట్రావుపేట గ్రామ పంచాయతీ కి వచ్చిన నూతన ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి ని శాలువాతో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కంకణాల నర్సింలు మరియు గ్రామ పంచాయతీ సెక్రటరి నర్సింగరావు, సత్కరించారు అనంతరం గ్రామంలోని పార్కును నర్సరీని పరిశీలించారు ఈ కార్యక్రమానికి. ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ కుమార్, కారోబార్ కనకయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయండి

– అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్



**చేర్యాల ప్రజాజ్యోతి :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలంటూ శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాల ప్రాంతంలోని చేర్యాల మున్సిపాలిటీ, చేర్యాల రూరల్ మండలం, కొమురవెల్లి మండలం, మద్దూరు మండలం, మరియు ధూళిమిట్ట మండలం ప్రాంత ప్రజలు దాదాపు రెండు లక్షల వరకు ఉంటారని చెప్పారు. వీరి అవసరాలకు రెవెన్యూ పనుల మీద సిద్దిపేటకు, వ్యవసాయ సమస్యలకు గజ్వేల్ కు, పోలీస్, కరెంటు సమస్యలకు హుస్నాబాద్ కు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తే కావలసిన ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ఆఫీసు కూడా ఉంది కాబట్టి దాన్ని వాడుకోవాలని సూచించారు.

## చిన్నకోడూర్ ఎస్ఐని మర్యాదపూర్వకంగా
# కలిసిన వేకిల్ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు

– రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించిన ఎస్ఐ బాలకృష్ణ!



**చిన్నకోడూర్, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలో లైట్ మోటార్ వేకిల్ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం రోజు స్థానిక ఎస్.ఐ జి. బాలకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ బాలకృష్ణ డ్రైవింగ్ లో పాటించాల్సిన జాగ్రత్తలపైన పలు సూచనలు చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మద్యం సేవించి వాహనాలు నడుపకూడదని అదేవిదంగా మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచుకోవద్దని సూచించారు.

# బిజెపి జిల్లా కార్యవర్గం ఎన్నిక

– ప్రధాన కార్యదర్శిగా భూరెడ్డిగారి విభీషణ్ రెడ్డి



**సిద్దిపేట టౌన్ ప్రజాజ్యోతి :** బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూరెడ్డిగారి విబీషణ్ రెడ్డి నియామకం అయ్యారు. భారతీయ జనతా పార్టీ (బిజెపి) సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి జిల్లా కార్యవర్గాన్ని నియమించారు ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యక్షులుగా బురుగు సురేష్ గౌడ్ (చేర్యాల), మద్దెల రోశయ్య (మిరుదొడ్డి), కొత్తపల్లి వేణుగోపాల్(సిద్దిపేట) కుడిక్యాల రాములు (జగదేవపూర్), పేరాల తిరుపతిరావు (నంగునూర్), ప్రధాన కార్యదర్శులుగా భూరెడ్డిగారి విభీషణ్ రెడ్డి(తొగుట), కానుగంటి శ్రీనివాస్ (మిరుదొడ్డి), తోకల ఉమరాణి, కార్యదర్శులు పత్రి శ్రీనివాస్ యాదవ్, బొమ్మగొని పద్మ (సిద్దిపేట), కూరెళ్ల రాజు (మద్దూర్ ), పరికి రవి (దుబ్బాక ), మన్నెం శశిధర్ రెడ్డి(కొండపాక ) లను నియమించారు. అలాగే బిజెపి యువ మోర్చా అధ్యక్షులను నియమించారు. యువ మోర్చా అధ్యక్షులుగా నీలం దినేష్ (సిద్దిపేట), మహిళా మోర్చా అధ్యక్షురాలుగా ఇర్రి ఉమా (చేర్యాల), దళిత మోర్చా అధ్యక్షులుగా నత్తి శివకుమార్ (గజ్వేల్), ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా బొమ్మగాని సతీష్కుమార్ (హుస్నాబాద్), మైనారిటీ మోర్చా అధ్యక్షులుగా మహ్మద్ ముబీన్ (సిద్దిపేట), కిసాన్ మోర్చా అధ్యక్షులుగా సత్తు తిరుమల్ రెడ్డి (దుబ్బాక ) లను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి తెలిపారు.

# అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణోత్సవం..!



**నందిగామ, ఫిబ్రవరి 16(ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో శివాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శివాలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవం ఘనంగా అంగరంగ వైభవంగా బ్యాండ్ బజనలతో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ శ్యాంసుందర్ రెడ్డి, పంతుళ్ల వీరేశం, కరుణాకర్, మల్లికార్జున, రాజు, మంకాల శ్రీశైలం, ఆవుల శివశంకర్, శ్రీను, మధు, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ సర్పంచులు జెట్టా కుమార్, రాజు, వీరేందర్ గౌడ్, విఠల్, అంజయ్య, జంగయ్య, చంద్రమౌళి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి ఏసీపీగా శ్రీనివాసరావు నియమించడం హర్షదాయకం

– దరువు అంజన్న




**కూకట్ పల్లి, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కూకట్ పల్లి ఏసీపి గా శ్రీనివాసరావు పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఓయూ జేఏసీ చైర్మన్ దరువు అంజన్న మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దరువు అంజన్న మాట్లాడుతూ గత 13 సంవత్సరాల క్రితం శ్రీనివాసరావు ఇక్కడ ఏసీపీగా పని చేశారని, ఆ సమయంలో పేదల పక్షాన నిలిచి వారికి రక్షణ కల్పించాడని ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించాడని, శ్రీనివాసరావు ప్రజల మనిషని కొనియాడారు. అటువంటి మహోన్నత వ్యక్తి మన ప్రాంతానికి ఏసీబీగా రావడం హర్శించదగ్గ విషయమని అన్నారు.

# బస్తిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తా

– పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు ఉట్ల చంద్ర రెడ్డి



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) :** బస్తీ సమస్యలను తెలుసుకొని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం బస్తీలోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయంలో ఆవరణలో జిహెచ్ఎంసి సిబ్బంది చేపడుతున్న తాత్కాలిక మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి ఆలయ చైర్మన్ గడ్డం రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉద్యమం స్ఫూర్తితో కార్మికులు

# మోడీ ప్రభుత్వంపై పోరాటాలు సిద్ధం కావాలి

– ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ పిలుపు ర్యాలీ రాస్తారోకో



**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 16(ప్రజా జ్యోతి )** జగద్గిరిగుట్ట నుండి గాంధీనగర్ రంగారెడ్డి నగర్ పారిశ్రామికవాడల మీదుగా పెద్ద ఎత్తున కార్మికులు ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో ఐడిపిఎల్ చౌరస్తా వరకు ర్యాలీ రాస్తారోకోనిర్వహించారు ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాన్ని వలపిస్తుందని భారతదేశంలో ఢిల్లీ కేంద్రంలో రైతులు గిట్టుబాటు ధర కోసం నిరసన తెలియజేస్తున్నారని రైతుల స్ఫూర్తితో స్ఫూర్తితో యావత్ కార్మికులు మోడీ ప్రభుత్వం పై పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు కార్మిక జాతీయ సమ్మెలో కార్మికులకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిమింటి నాగరాజు దరిపెల్లి యాదగిరి మురళి బాల్నగర్ జోన్ ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు భాస్కర్ గారు నారాయణ రెడ్డి గారు తదితరులు సమ్మెలో పాల్గొన్నరు.

# కొడిచెర్లలో పారిశుద్ధ కార్మికులకు సన్మానం

– ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు రవీందర్ రెడ్డి రవీందర్ రెడ్డి




**కొత్తూరు ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి)** కొత్తూరు మండలంలోని కొడిచెర్ల గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులను గురువారం ఎంపిటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గోపాల్,మండల వ్యవసాయ విస్తరణ అధికారి దీపిక, పంచాయతీ కార్యదర్శి నాగమణి, ఉపాధ్యాయురాలు కరుణ, అంగన్వాడి టీచర్ నాగలక్ష్మి, మహిళా మండలి సభ్యురాలు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి



**కొత్తూరు ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి)** శంషాబాద్ మండల పరిధిలోని శ్రీ సాయి విహార్ లో కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన జండగూడెం శ్రీశైలం గౌడ్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతనంగా నిర్మించిన ఇంటిలో శ్రీశైలం గౌడ్ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అందుకు భగవంతుడు అన్ని విధాలుగా దీవించి ఆశీర్వదించాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జాండగూడెం సుదర్శన్ గౌడ్, వెంకట్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలి

– వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) :** వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో సీఐఐ అగ్రి టెక్ సౌత్–2024 నాలుగో ఎడిషన్‌ను, అగ్రి విజన్–2024 సదస్సును ఆయన ప్రారంభించారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు, సదస్సులను రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మండలాలు, రైతు వేదికల్లో ఏర్ఆపటుచేసి, రైతుల వద్దకు నేరుగా ఈ పరిజ్ఞానాన్ని తీసుకెళ్లాలని సీఐఐని మంత్రి కోరారు. ఈ సదస్సులో వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, సీఐఐ తెలంగాణ చైర్మన్, సీఎస్ఆర్ ఎస్టేట్స్ సీఎండీ సి.శేఖర్ రెడ్డి, సదరన్ రీజియన్ మాజీ చైర్మన్ అనిల్ కుమార్ వి.ఈపూర్, డాక్టర్ రోనీ కాఫ్మన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి, ప్రొఫెసర్ గినిగె అతులా, పిజెటిఎస్ఎయు మాజీ ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్ రావు, ప్రసంగించారు.

## నేడు టెక్ ప్రొఫెషనల్స్ కోసం హెచ్ సీఎల్ టెక్ నియామక డ్రైవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) : టెక్నాలజీస్ లో 500కి పైగా స్థానాల కోసం ప్రజలను నియామకం చేయడానికి గన్నవరం, విజయవాడల్లో తమ క్యాంపస్ లలో ఫిబ్రవరి 17న హెచ్ సీఎల్ టెక్, ఒక ప్రముఖ అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ నియామకం డ్రైవ్ నిర్వహిస్తుందని హెచ్ సీఎల్ టెక్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, విజయవాడ సెంటర్ ప్రధాన అధికారి శివ ప్రసాద్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెక్నాలజీస్ లో మూడేళ్లకు పైగా అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ కోసం హెచ్ సీఎల్ టెక్ నియామకం డ్రైవ్ అవకాశాలు అందజేస్తోందన్నారు.

## గర్ల్ ఫ్రెండ్ మండి న్యూ బ్రాంచ్‌ను ప్రారంభించిన హీరోయిన్ శ్రీలీల



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) : గర్ల్ ఫ్రెండ్ మండి కు హైదరాబాద్ నగరంలో ఫ్యాన్స్ ఉన్నారు. ఫుడ్ లవర్స్ తమకు కావాల్సిన ఐటమ్స్ ను గర్ల్ ఫ్రెండ్ మండిలో ఎంజాయ్ చేస్తూ ఉంటారు. మాదాపూర్, గచ్చిబౌలి లో గర్ల్ ఫ్రెండ్ మండి బ్రాంచిలు కలిగి ఉన్న విషయం తెలిసిందే. తాజాగా బంజారాహిల్స్ లో నూతనంగా గర్ల్ ఫ్రెండ్ ముండి కొత్త బ్రాంచ్ ను హీరోయిన్ శ్రీలీల ప్రారంభం చేశారు. బంజారాహిల్స్ లో జలగం వెంగలరావ్ పార్క్ ఎదురుగా ఉన్న గర్ల్ ఫ్రెండ్ మండి గ్రాండ్ గా లాంచ్ అయ్యింది. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ నేను ఫుడ్ లవర్ ను సో గర్ల్ ఫ్రెండ్ మండి న్యూ బ్రాంచి నా చేతుల మీదుగా లాంచ్ అవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. అలాగే గర్ల్ ఫ్రెండ్ మండి ఓనర్ కుదిరేషన్ మాట్లాడుతూ మాదాపూర్, గచ్చిబౌలి తరువాత బంజారాహిల్స్ లో మా బ్రాంచ్ ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. మా దగ్గర నాన్ వెజ్ తో పాటు అన్ని రకాల వెజ్ ఐటమ్స్ ఉన్నాయని తెలిపారు.

## వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి!

– ఎస్సై సురేష్

మునిపల్లి ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మునిపల్లి ఎస్సై సురేష్ అన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని రకాల సరైన డాక్యుమెంట్స్ ను ఉంచుకొని వాహనాలను నడుపుకోవాలని మైనర్ డ్రైవింగ్ సీట్ బెల్ట్ లేకుండా ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని అలాంటి వారిపై ఇ-చాలన్ లను విధిస్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే మెజిస్ట్రేట్ వారు పదివేల రూపాయల జరిమానా విధించడం జైలుకు పంపడం జరుగుతుందన్నారు.

## ఉమామహేశ్వర గుడిలో ఘనంగా రథసప్తమి పూజా కార్యక్రమాలు



జనగామ,ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి) జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ ఉమామహేశ్వర స్వామి గుడిలో ఘనంగా రథసప్తమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యగారు రాజేష్ భార్గవ ఆధ్వర్యంలో సూర్య భగవానునికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి దీపం, దుపం, నైవేద్యం సమర్పించి భక్తులకు ఇవ్వడం జరిగింది. పూజలో పాల్గొన్న భక్తులు ఓమ్ భాస్కరాయ నమః, ఓం ఆదిత్యాయనమః అంటూ భజన కార్యక్రమం నిర్వహించి, ఆలయ ప్రాంగణంలోని దీపాలు వెలిగించడం జరిగింది. భక్తులు చుంచు రేణుక,స్వాతి,పార్వతి పటేల్ పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

చేర్యాల ప్రజాజ్యోతి : ప్రభుత్వ అనుమతి లేకుండా చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకునూరు గ్రామ శివారు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది పట్టుకొని శుక్రవారం చేర్యాల పోలీసులకు అప్పగించారు. టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకునూరు శివారులో అదే గ్రామానికి చెందిన మంతపురి ప్రశాంత్ శుక్రవారం తన ట్రాక్టర్ నెంబర్ ఏపీ 23కె 3958 లో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది వెళ్లి ట్రాక్టర్ ను పట్టుకొని చేర్యాల పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా చేసినా పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటువంటి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667447, 8712667446, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



## సిద్దిపేటలో కార్మిక సంఘాల భారీ ర్యాలీ



సిద్దిపేట టౌన్ ప్రజాజ్యోతి : కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం జాయింట్ యాక్షన్ పేరుతో గ్రామీణ బంద్ – సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సమ్మె సక్సెస్ అయిందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్, బి ఆర్ టి యు రాష్ట్ర కార్యదర్శి మంచే నర్సింహులు, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఈ దారి మల్లేశంలు అన్నారు. కేంద్ర కమిటీలు వచ్చిన పిలుపులో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్స్ నుండి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ ,ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు గడచిన 10 సంవత్సరాల కాలంలో కార్మిక, రైతాంగ, ప్రజల ఒక్క మంచి పని చేయకపోగా స్వాతంత్రానికి పూర్వం పోరాడి సాధించకు కార్మిక చట్టాలని రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి 29 కార్మిక చట్టాలను రద్దుపరిచి బడా పెట్టుబడి దారి, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా పార్లమెంట్లో చట్టాలు చేసిందని వాటి ఫలితంగాకార్మిక వర్గానికి తీవ్ర నష్టం వాటిలో ఉ ందని అన్నారు. . పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి మోయలేని భారం మోపిందన్న అధికారాంలకు వచ్చే ముందు ఏటా రెండు కోట్ల ఉ ద్యోగాలని, ప్రతి పేదవాడికి బ్యాంక్ అకౌంట్ లో 15 లక్షల రూపాయలు ఇస్తామనిఅనేక వాగ్దానాలు చేసి వాటిని విస్మరించి ప్రజలను దోచుకున్నారన్నారు. ప్రజల, కార్మికుల హక్కులకై ఉద్యమిస్తుంటే వారిని ఉక్కుపాదంతో తుంచేస్తున్నారని ఉన్నారు ప్రజలను ఐక్యం కాకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తూ తన రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని మత రాజకీయాలను, తన మతోన్మాద ఎత్తుగడలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని వాటికి వ్యతిరేకంగా నిలవడానికి దేశవ్యాప్తంగా ఈ సమ్మె అని వారన్నారు ఈ నియంతృత్వ ప్రభుత్వానికి చరమ గీతం పడేందుకు ప్రజలు రానున్న సాధారణ ఎన్నికల్లో బిజెపిని ఇంటికి పంపించాలని ఈ సందర్భంగా కార్మిక వర్గానికి పిలిపించారు. భారీ ప్రదర్శన ర్యాలీలో సంఘీభావం ప్రకటిస్తూ ర్యాలీలో పాల్గొని మాట్లాదారు సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ , బిఆర్ఎస్ జిల్లా నాయకులు పాల సాయిరాం, వాపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, నాయకులు కొండం సంజు కుమార్, వీడియోస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, ఏఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జక్రిపోతుల జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు మధు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు చొప్పరి రవికుమార్, ఎం.పద్మ, అమ్ముల బాలసయ్య, మామిడాల కనకయ్య, చింతల వెంకటయ్య, మండల భాస్కర్, రాజమౌళి, మల్లయ్య, బి ఆర్ టి యు జిల్లా నాయకులు శోభన్,మోహన్ రెడ్డి, బాయికాడి శ్రీనివాస్, శేఖర్ ఏఐటీయూసి జిల్లా నాయకులు బెక్కంటి సంపత్, హెచ్ఎంఎస్ జిల్లా నాయకులు నాగరాజ్,మాదాసు రాములు ఈదరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

– కేసు నమోదు, తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన నాలుగు ట్రాక్టర్లు సీజ్

– అక్రమార్కులకు హుస్నాబాద్ సిఐ కిరణ్, కోహెడ ఎస్ఐ తిరుపతి హెచ్చరిక



కోహెడ, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) ప్రభుత్వ అనుమతులు లేకుండానే, కోహెడ మండల పరిధిలోని తంగళ్లపల్లి మోయతుమ్మెద వాగులో నుంచి ప్రతి రోజు అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న హుస్నాబాద్ సి.ఐ ఎర్రల కిరణ్, కోహెడ ఎస్.ఐ తిరుపతి వారి సిబ్బందితో.. తంగళ్లపల్లి శివార్ లోనీ మోయత–ుమ్మెద వాగు వద్దకు వెళ్లి, ఆకస్మిక దాడులు నిర్వహించగా.. గ్రామానికి చెందిన చొప్పరి సంపత్, చొప్పరి లింగం, చొప్పరి శ్రీకాంత్, బిగుళ్ల నరేష్ లు, నాలుగు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పట్టుబడ్డారు. కేసులు నమోదు చేసి, ఆ నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సి.ఐ తెలిపారు.

**పర్మిషన్ లేకుండా ఇసుక రవాణా చేస్తే.., చట్టప్రకార కఠినచర్యలు**

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశలనుసారం అక్రమ ఇసుక రవాణాపై నిఘా ఉంచామని, ఎవరైతే అక్రమ రవాణాకు పాల్పడుతున్నారో.. వారిపై కేసులు నమోదు చేసి, ఆ వాహనాలను సీజ్ చేసి చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని, సి.ఐ హెచ్చరించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



రాయపోల్/ దౌల్తాబాద్ ఫిబ్రవరి 16 ప్రజా జ్యోతి

దౌల్తాబాద్ మండల పరిధిలోని తిమ్మక్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఇప్ప మల్లేశం తల్లి ఇటీవల మరణించిన తెలుసుకొని కుటుంబాన్ని శుక్రవారం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమని ధైర్యంగా ఉండాలన్నారు. వారితో పాటు మాజీ ఎంపీటీసీ మద్దెల స్వామి,మాజీ సర్పంచ్ కాశబోయిన భాస్కర్, టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి,మల్లేశం తదితరులున్నారు.

## తెలంగాణ ఉద్యమంలో పోరాడిన కళాకారులను గుర్తించాలి

### – తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షులు బొల్లం రాజేష్



రాయపోల్ ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి ) తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రజలను చైతన్యం చేస్తూ అనేక ప్రజా ఉద్యమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఆటపాటల్లో గ్రామ గ్రామంలో తెలంగాణ ఉద్యమంలో కార్యక్రమాలు చేశామని పాటల ద్వారా గ్రామాలలో ప్రజలను తెలంగాణ ఉద్యమ వైపు తెలంగాణ అంటే ఏంది అనే ఉద్దేశంతో పాటలు ద్వారా వారిని ఆకర్షణ చేశామన్నారు. ప్రజా పోరాటాలతో చైతన్యపరిచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఎక్కడ ధూమ్ ధామ్ జరిగిన అక్కడికి వెళ్లి తన ఆటపాటలతో తెలంగాణ ప్రజలను ఆకర్షించారు దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు బొల్లం రాజేష్ ప్రజా ఉద్యమంలో పాల్గొని ఉద్యమంలో ముందుండి తన ఆటపాటాలతో ఉమ్మడి మెదక్ జిల్లాలో తెలంగాణ ఉద్యమ సమయంలో గ్రామ మండల జిల్లాస్థాయిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపే పాటలు పాడుతూ తనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చారు. ప్రజా ఉద్యమాలతో ఇట్టకెళ్ళకు తెలంగాణ వచ్చినప్పటికీ కళాకారులకు అప్పటి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వకపోవడం వలన తన లాంటి ఎంతో మంది కళాకారులకు అన్యాయం జరిగిందన్నారు. కాగా ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వం విస్మరించిన కళాకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ కళావేదిక సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గాతెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం మలిదశ ఉద్యమంలో. తెలంగాణ ప్రజలను చైతన్య పరుస్తూ అనేక ప్రజా పోరాటాల్లో ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచి రాష్ట్రం సాధించడంలో కీలకంగా పనిచేసిన ఉద్యమ కళాకారులమైన మాకు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక గత బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం ప్రజలను చైతన్య పరిచే సత్తా ఉన్న కళాకారులమైన మేము మాకు మేమే చైతన్యం కాకపోవడం చాలా బాధాకరమైన విషయం.ఇలాంటి పరిస్థితుల్లో కళాకారులమైన మా హక్కుల కోసం. నకిరేకంటి కిరణ్ కుమార్ అన్న గారు తెలంగాణ కళావేదిక అనే సంఘాన్ని స్థాపించడం అందులో నాపై నమ్మకంతో సిద్దిపేట జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకోవడం నా కళకు దక్కిన గౌరవంగా భావిస్తూ నాకి బాధ్యతలు అప్పజెప్పినటువంటిరాష్ట్ర అధ్యక్షులు నకిరే కంటి కిరణ్ కుమార్ అన్నగారికి మరియు రాష్ట్ర గౌరవ సలహాదారులు మద్దెల నర్సింలు గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## క్రికెట్ టౌర్నీని ప్రారంభించిన యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవీందర్ చవాన్



జహీరాబాద్, ఫిబ్రవరి 16( ప్రజా జ్యోతి న్యూస్) క్రీడల్లో గెలుపొటములు సహజమని గెలిచినవారు పొంగిపోకుండా ఓడిపోయిన వారు కృంగిపోకుండా ముందుకు సాగినప్పుడే క్రికెట్ లో నిజమైన గెలుపు సాధ్యమని యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రవీందర్ చవాన్ తెలిపారు శుక్రవారం నాడు జహీరాబాద్ మండల పరిధిలోని శాఖాపూర్ తండలో బంజారా క్రికెట్ టోర్నమెంట్ శేకాపూర్ తాండ మాజీ సర్పంచ్ లాలిబాయి నాగు చవాన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవీందర్ చవాన్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నాగు చవాన్ మాట్లాడుతూ క్రికెట్ ఒక జెంటిల్మెన్ ఆట అని, క్రీడల్లో అంకితభావం క్రమశిక్షణ చాలా అవసరం అని అన్నారు. టౌర్ని విజేతకు 50 వెయ్యిల నగదు నాగు చవాన్, రన్నర్ జట్టుకు 30 వెయ్యిల రూపాయలను యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవీందర్ చవాన్ తరపున ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు రవీందర్ చవాన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగు చవాన్, మాజీ ఉప సర్పంచ్ బాణోత్ ప్రేమ్ సింగ్, రవీందర్ చవాన్, యువకులు, క్రీడాకారులు, గ్రామస్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్‌కు ఘనంగా సత్కరించిన కాంగ్రెస్ నాయకులు



జహీరాబాద్, ఫిబ్రవరి 16( ప్రజా జ్యోతి న్యూస్ ) కోహిర్ మండల తాహసిల్దార్ గా కల్హేర్ మండలంలో విధులు నిర్వహించి బదిలీపై వచ్చిన బాల శంకర్ శుక్రవారం నాడు మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిన్నటి వరకు తహసిల్దార్ గా విధులు నిర్వహించిన శాంతకుమారి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రం కాంగ్రెస్ నాయకులు, కోహిర్ కంటేస్టేడ్ సర్పంచ్ అభ్యర్థి మొహమ్మద్ హమేద్ బృందం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తాహేసిల్దార్ బాల శంకర్ కు శాలువకప్పి పుల మలతో ఘనంగా సన్మానించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన తహేసిల్దార్ బాల శంకర్ మాట్లాడుతూ కోహిర్ మండల పరిధిలో నెలకొని ఉన్న భూ సమస్యలను అందరి సహకారంతో సమూలంగా పరిష్కరిస్తామని, ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకొంటమని, కళ్యాణా లక్ష్మి, షాది ముబారక్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటమని అన్నారు. కార్యక్రమంలో మొహమ్మద్ హమేద్ సీనియర్ నాయకులు, అహేమద్ బాలల, మొహమ్మద్ యూనిస్ కిరణ, అబ్దుల్ అలిమ్, ఖాయ్యుం కైఫ్, ఆజ్మత్ కింగ్, సర్వర్ ఫిర్దోస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రగతికి నరేంద్ర మోడీ నాయకత్వం అనివార్యం

### – నవోదయ మురళి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం (గంగాధర్ మురళి)



జహీరాబాద్, ఫిబ్రవరి 16( ప్రజా జ్యోతి న్యూస్) నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం గంగాధర్ మురళి, (నవోదయ మురళి) శుక్రవారం మధ్యాహ్నం ఒక ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ వారు మాట్లాడుతూ దేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నడూ చూడని అభివృద్ధి శకాన్ని చూశాయి పెండింగ్ ప్రాజెక్టులు అన్నిటినీ మన మోడీ ప్రభుత్వం వేగవంతం చేసింది మరియు తెలంగాణ రాష్ట్రం అంతట రోడ్లు రైల్వేలు సివిల్ వర్క్స్ విమాన యానంతో సహా వివిధ రంగాలలో మౌలిక సదుపాయాలను భారీగా పెంచింది హైదరాబాద్ తిరుపతి విశాఖపట్నం సహా తెలుగు రాష్ట్రాల లోని నగరాల రూపురేఖలు మారుస్తూ స్మార్ట్ సిటీకి ప్రాజెక్ట్ కు మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు, మోడీ దర్శనిక స్ఫూర్తితో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు భారతదేశాన్ని భవిష్యత్తు వైపు నడిపించే దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నాయి, మోడీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలో భాగస్వామ్యం కావడం వల్ల తెలంగాణ రాష్ట్రం ఉజ్వల భవిష్యత్తుకు భరోసా లభించింది తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి శ్రేయస్సు వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి 2024 లోక్సభ ఎన్నికలు సమీపిస్తున్న కరుణంలో తెలుగు ప్రజలు అభివృద్ధి లో నూతనోత్సవాన్ని రగిలిస్తూ దేశ పౌరులందరికి ఉజ్వల భవిష్యత్తుకు హామీనిస్తూ మన భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి నిలబడదాం మల్లొకసారి బిజెపి పార్టీని గెలిపించి నరేంద్ర మోడీ దేశ ప్రధాని చేద్దామని మీ నవోదయ మురళి దేశ ప్రజలకు విజ్ఞప్తి అని అన్నారు.

## సీఎంఆర్ పూర్తి చేయకపోతే చర్యలు తప్పవు

### – మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణమిస్తాము – సీఎంఆర్‌కు ఫిబ్రవరి 29 చివరి తేదీ

### – గడువు లోపు సీఎంఆర్‌కు పూర్తి చేయాలి – రైస్ మిల్లర్లకు తేల్చి చెప్పిన జిల్లాకలెక్టర్ రాజర్షి షా



మెదక్ ప్రజాజ్యోతి : జిల్లాలో అధిక శాతం సీఎం ఆర్ పెండింగ్ వున్నా మిల్లుల యజమాన్యలతో మిల్లుల వారీగా శుక్రవారం ఐడిఓసి లోని విడియో సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన గడువు ఫిబ్రవరి 29 వరకు అవకాశం ఇచ్చిందని , అప్పటి లోగా బియ్యం పెట్టని మిల్లుల యజమానులపై ఆర్ ఆర్ యాక్ట్ క్రింద స్థిర చర ఆస్తులు జప్తు చేయడమే కాకుండా , క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. నెలలు గడుస్తున్నా మిల్లర్లు అలసత్వాన్ని తీవ్రంగా పరిగణమిస్తామని హెచ్చరించారు. సీఎంఆర్ కేటాయింపులపై కూలంకషంగా చర్చించారు. రైతుల నుండి ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరుపుతూ ఈ నెలాఖరు లోగా నిర్దేశిత కోటాకు అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థకు చేరవేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. విషయంలో నిర్లక్ష్యానికి తావు కల్పిస్తూ, నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని కరాఖండీగా తేల్చిచెప్పారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున, ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని తాము ఎంత మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని రైస్ మిల్లులలో సీ.ఎం.ఆర్ కేటాయింపుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్ణీత గడువులోపు లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు తేల్చి చెప్పారు.జిల్లా వ్యాప్తంగా గల అన్ని రైస్ మిల్లులలో తప్పనిసరిగా పూర్తి స్థాయి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ రైస్ మిల్లింగ్ జరుపుతూ, ఈ నెలాఖరు లోపు ఎఫ్ సీ ఐ కి నిల్వలు చేరవేయాలని గడువు విధించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్ , సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ , డిసిఎస్ఓ బ్రహ్మారావు, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా బొంబుగొండకు బోనాలు





టేక్మాల్ (ప్రజాజ్యోతి ప్రతినిధి): మండల పరిధిలోని బొడ్మట్ పల్లి లో నూతనంగా నిర్మించిన బొంబుగొండ విగ్రహానికి గొల్ల కుర్మలు బోనాలు తీశారు. శివసత్తుల విన్యాసాలు ,డోలు వాయిస్తు అందరినీ ఆకట్టుకున్నారు. గడిచిన నాలుగు రోజులు ఊళ్ళో పండగ వాతావరణం ఏర్పడింది. అనంతరం బొంబుగొండ విగ్రహ దాత కీ"శే" బేగరి రాములు కుమారుడు బేగరి మొగులయ్య కు గొల్ల కుర్మలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడు టిప్పర్ లారీలు సీజ్

## - ఎస్సై కరుణాకర్ రెడ్డి




మనోహరాబాద్, ఫిబ్రవరి 16 ( ప్రజా జ్యోతి ) అర్ధరాత్రి పూట ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న మూడు టిప్పర్ లారీలను పోలీసులు సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎస్సై వివరాల ప్రకారం గురువారం, అర్ధరాత్రి పరిశ్రమలకు అనుమతి లేకుండా అక్రమ మట్టి రవాణా చేస్తున్న మూడో టిప్పర్ లారీలను రంగయ్య పల్లి గ్రామ శివారులో సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్సై కరుణాకర్ రెడ్డి,తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ మట్టి బ్లాస్టింగ్ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మనోహరాబాద్ ఎస్ ఐ కరుణాకర్ రెడ్డి, హెచ్చరించారు.

# మైనంపల్లి దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మెదక్ నేతలు



మెదక్ ప్రజాజ్యోతి : మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు %--% వాణి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెల్పిన మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు %--% వాణి దంపతులకు హైద్రాబాద్ లోని వారి స్వగృహంలో పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగా నరేందర్, న్యాయవాది జీవన్ రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జపవన్, స్వామి నాయక్, గుడ్డు, మనోజ్, భాస్కర్, అశోక్, రాజాసింగ్, సిద్ధిరాములు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమం
# పట్టించుకోకుండా హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

## - శివ్వంపేట మండల సీఐటీయూ నాయకులు విజయలక్ష్మి, సువర్ణ




శివంపేట్ ప్రజాజ్యోతి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మె సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శభాష్ పల్లి నుండి సుగుణ డ్రైవర్స్%ఘ%ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి దొంతి మీదుగా పలు పరిశ్రమలు మూసివేసియడం జరిగిందని,ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు విజయలక్ష్మీ,సువర్ణ . ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారులకు వచ్చి పది సంవత్సరాలైనా కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న హక్కులు 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా,12 గంటల పని విధానం అమలు,కనీస వేతనాని 174 రూపాయలుగా,కాంట్రాక్టు విధానాన్ని ప్రోత్సహిస్తుందని, స్కీమ్ వర్కర్ల అందర్నీ ప్రభుత్వ ఉ ద్యోగులుగా గుర్తించాలని ,రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా . అచ్చేదిన్ అయేగా, మేకిన్ ఇండియా అంటూ మోసపూరిత నినాదాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం నేటికీ ఏం చేయలేకపోయారని అన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు, పేద కుటుంబానికి 15 లక్షల రూపాయలు అకౌంట్ లో జమ చేస్తాం, ధరలు తగ్గిస్తాం అని హామీ ఇచ్చి పది సంవత్సరాలైనా నేటికీ అతీ గతి లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు సహజ వనరులను కార్పోరేట్ల పని చేసిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల మీద దాడి చేసి నాలుగు లేబర్ కోడ్ తెచ్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. రైతాంగానికి ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం రైతులను మోసం చేసి నల్ల చట్టాలు తీస్తే చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరం పాటు పోరాటం చేసి మోడీ మెడలు వంచిన చరిత్ర రైతాంగానికి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేదలను ఆదుకోవడం కోసం యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి చట్టాన్ని తెస్తే.. మోడీ ప్రభుత్వం చట్టాన్ని నిర్వర్యం చేస్తూ కూలీలకు ఉపాధి లేకుండా నిధులు తగ్గించి వ్యవసాయ కూలీల పొట్టగొడుతుందన్నారు. ధరలు విపరీతంగా పెంచి మధ్యతరగతి ఉద్యోగులను ప్రజలను నడ్డి విడిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన రోజులు దగ్గరలో ఉన్నాయని రాబోయే కాలంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక, రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించి మోడీకి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. మండల కేంద్రం లో వివిధ రంగాల కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం తూప్రాన్-నర్సాపూర్ ప్రధాన రహ రహదారిపై రాస్తారోకో చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సుగుణ ప్రధాన కార్యదర్శి యాదగిరి,శేఖర్, కుమార్,ఇంద్రేష్,బిఆర్ టి యు మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలివేరి వీరేశం,గ్రామ పంచాయితీ కార్మికుల మండల కార్యదర్శి శివశంకర్ రేణుక,గోపమ్మ,ఆటో యూనియన్ నాయకులు ఆంజనేయులు గౌడ్,మిషన్ భగీరథ మండల నాయకులు స్వామి, తదితరులు పాల్గొన్నారు

# నియంతృత్వానికి వ్యతిరేకంగానే అవిశ్వాస నిర్ణయం

## - కుండబద్దలు కొట్టిన కౌన్సిలర్లు



మంథని, ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) మంథని పురపాలక సంఘం చైర్మన్ పుట్ట శైలజ నియంతృత్వ పోకడలను భరించలేక ఆత్మగౌరవం చంపుకోలేక అవిశ్వాస తీర్మానం పై నిర్ణయం తీసుకున్నామని ఇటీవల బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్లు తెల్పి చెప్పారు. మున్సిపాలిటీ కార్యాలయం సమావేశ మందిరంలో అవిశ్వాసం నెగ్గిన అనంతరం కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో మెజారిటీ కౌన్సిలర్ల నిర్ణయాలకు విలువ లేకుండా పోయిందని అన్నారు. బీసీ వాదం, బహుజన వాదం అని చెప్పే బిఆర్ఎస్ నాయకుని మాటల్లో నిజాయితీ లేదని అన్నారు. కోట్ల రూపాయల నిధులు వచ్చాయని చెప్పడమే కానీ గత చైర్మన్ చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. కౌన్సిలర్లను గౌరవించక పోవడం, గుర్తించకపోవడం నిరాశ కలిగించిందని అన్నారు. గత చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని తన స్వలాభావాన్ని చూసుకున్నారని మండిపడ్డారు. తమ వార్డులలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే ధ్యేయంతో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచామని కానీ తాము ఆశించిన ఫలితం దక్కలేదని అన్నారు. మాజీ చైర్మన్ కు ఇష్టమైన చోట మాత్రమే సిసి రోడ్లు ఇతర పనులు చేశారు కానీ ప్రాధాన్యత క్రమంలో మిగతా వార్డులలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. శ్రీపాదరావు, శ్రీధర్ బాబు కాలంలో చేసిన పనులే మంథని పట్టణంలో కనిపిస్తున్నాయి తప్ప మంథని మునిసిపాలిటీగా ఏర్పడిన తర్వాత చేసిన పనులేమీ లేవని అన్నారు. అందుకే తాము టిఆర్ఎస్ పార్టీలో పుట్ట మధు, శైలజ ఒంటెద్దు పోకడలకు విసుగుచెంది అభివృద్ధిని కాంక్షించే నాయకుడు మంథని ఎమ్మెల్యే, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. ఈ క్రమంలోనే మంథని మున్సిపాలిటీ చైర్మన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమారుల పైన అవిశ్వాసం పెట్టి నెగ్గామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెండ్రి రమాదేవి, సీపతి బాలయ్య, కుర్ర లింగయ్య, వీకే రవి,చొప్పకట్ల హనుమంతరావు, నక్క నాగేంద్ర, గుండా విజయలక్ష్మి, కొట్టే పద్మ, లక్ష్మి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.